



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 213 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి మంగళవారం 8 ఏప్రిల్ 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

## ఏఐ సాయంతో నకిలీ వీడియోలు సృష్టించారు

### హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్

- కంచ గచ్చిబౌలి భూముల వివాదం
- జింకలు, నెమళ్లు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలు సృష్టించారన్న ప్రభుత్వం
- ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన మేనక గురుస్వామి




**హైదరాబాద్ పెన్ పవర్:**కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల వ్యవహారంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) సాయంతో నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్‌ను సృష్టించారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. భూమిని చదును చేసే క్రమంలో బుల్డోజర్లను చూసి జింకలు, నెమళ్లు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలను సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. నకిలీ వీడియోలు సృష్టించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. ఈ పిటిషన్‌పై ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు తెలిపింది.

## హెచ్‌సీయూలో జింకలున్నాయనడం నిజం కాదు..

# ఢిల్లీలో బండి సంజయ్ ఇంట్లో నెమళ్లున్నయ్

- రాష్ట్రంలో బీజేపీకి అధికారం కల్ల
- హెచ్‌సీయూలో జింకలున్నాయనడం నిజం కాదు
- ఢిల్లీలో బండి సంజయ్ ఇంట్లో నెమళ్లున్నయ్
- మీనాక్షి నటరాజన్ మంత్రులతో రివ్యూ చేయలే
- సెక్రటేరియట్‌లో కూర్చునే రైట్ అందరికీ ఉంది
- పీసీసీ చీఫ్‌మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం కల్ల అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గాంధీ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణకు 11 ఏళ్లలో ఏమి తెచ్చారో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు వైట్ పేపర్ రిలీజ్ చేయాలని అన్నారు. దీనిపై తాము చర్చకు సిద్ధమని చెప్పారు. అమిత్ షాలు ఆర్డర్ వేస్తేనే కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు పని చేస్తారని అన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 20వేల ఎకరాల ప్రభుత్వ భూములు కరిగి పోతే కిషన్ రెడ్డికి ఎందుకు పట్టదని చెప్పారు. 10వేల ఎకరాల భూములను కేసీఆర్ , కేటీఆర్ లు అమ్ముకుంటే కిషన్ రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి ఒక్క చాన్స్ కావాలని ప్రాధేయపడుతున్నారని అన్నారు. తెలంగాణకు ఏమి ఎలగబెట్టారని ఒక్క చాన్స్ అని అడుగుతున్నారని ప్రశ్నించారు. మూడోసారి కూడా మతం పేరున ఓట్లు అడిగి అధికారంలోకి వచ్చారని అన్నారు. మెట్రో కోసం ఒక్క రూపాయి తెచ్చిన పాపాన పోలేదని అన్నారు. మూసీ ప్రక్షాళన జరిగి హైదరాబాద్ ప్రజలు సుఖపడటం కిషన్ రెడ్డికి నచ్చదని అన్నారు. మతతత్వ రాజకీయాలను తెలంగాణ ప్రజలు కోరుకోరన్నారు. అధికారంలోకి వస్తామని కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. సచివాలయంలో కూర్చునే అధికారం అందరికి ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. మీనాక్షి నటరాజన్ మంత్రులతో రివ్యూ చేసింది అనటం అవాస్తవమని చెప్పారు. హెచ్‌సీయూలో జింకలు ఉన్నాయనేది వాస్తవం కాదన్నారు. నెమళ్ళు ఎక్కడైన ఉండొచ్చని చెప్పారు. ఢిల్లీలో బండి సంజయ్ ఇంట్లో కూడా నెమళ్ళు ఉన్నాయని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ కలెక్టర్ మృతి

- అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం యర్రగుంట్ల వద్ద దుర్ఘటన
- ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న రెండు కార్లు
- హెచ్‌ఎన్‌ఎస్ ఎస్ పీలేరు యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ మృతి

వివరాలు 2లో..



## సామాన్యులకు షాక్... భారీగా గ్యాస్ ధరల పెంపు!




- వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచిన కేంద్రం
- ఈ మేరకు కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటన
- ఉజ్వల పథక లబ్ధిదారులు, జనరల్ కేటగిరీ వినియోగదారులు ఇద్దరికీ ఈ ధరలు వర్తింపు
- నేటి నుంచే కొత్త ధరలు అమల్లోకి

వివరాలు 2లో..

## బనకచర్ల సంగతేంది..వివరాలున్నా ఎందుకు దాస్తుండ్రు

- 5 నెలల క్రితం కేంద్రం నుంచి లేఖ వచ్చినా చెప్తలేరెందుకు
- అన్ని విషయాలు షేర్ చేయాల్సిన అవసరం లేదు: జీఆర్ఎంబీ
- ఇన్ పుట్స్ ఇవ్వకుండా పనులు చేస్తాంటే కుదరదన్న తెలంగాణ
- వాడీ వేడిగా గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశం
- బోర్డు తీరుపై తెలంగాణ అధికారులు అసహనం



వివరాలు 2లో..

## హెచ్‌సీయూ ఏఐ వీడియోలు పోస్టు చేశారని బీఆర్ఎస్ నాయకులపై కేసు

- కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్, థామస్ అగస్టీన్‌పై కేసులు నమోదు
- ఇప్పటికే 7 కేసులు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు
- పలువురు ప్రముఖుల పైనా కేసు నమోదు చేసే అవకాశం



వివరాలు 2లో..

## సుప్రీంకోర్టు తీర్పును నేను అంగీకరించను

- బెంగాల్ లో 25 వేల ఉపాధ్యాయ నియామకాలను రద్దు చేసిన సుప్రీం
- తనను జైల్లో పెట్టినా సుప్రీం తీర్పును అంగీకరించబోనన్న మమత
- కోర్టు ధిక్కరణ కింద తనను జైల్లో పెట్టొచ్చని వ్యాఖ్య

వివరాలు 2లో..



## తెలంగాణలో నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం



- బీజేపీకి చెందిన అంజిరెడ్డి, మల్క కొమురయ్య ప్రమాణం
- ప్రమాణం చేయించిన ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- ముఖ్యమంత్రి సహా పలువురి అండతో తనకు అవకాశం వచ్చిందన్న అద్దంకి దయాకర్

**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ జనతా పార్టీకి చెందిన అంజిరెడ్డి, మల్క కొమురయ్య శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన ఎమ్మెల్సీలతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

వివరాలు 2లో..

# యువతకు ఉద్యోగాలు ఇవ్వండి



- ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బీహార్‌లో ర్యాలీ
- బీహార్ యువతకు ఉద్యోగాలు ఎందుకివ్వలేదని రాహుల్ గాంధీ నిలదీత
- తమ భవితవ్యాన్ని తాము రాసుకోవడానికి బీహార్ యువత సిద్ధంగా ఉందన్న రాహుల్ గాంధీ

**హైదరాబాద్ పెన్ పవర్:**బీహార్ ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు పారిపోవద్దని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. బీహార్‌లోని బెగుసరాయ్‌లో ఎన్ఎస్‌యూఐ నేషనల్ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీహార్ యువతకు రాష్ట్రంలోనే ఉద్యోగాలు ఎందుకు కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. తమ భవితవ్యాన్ని తాము తీర్చిదిద్దుకోవడానికి

వివరాలు 2లో..

# ఎమర్జింగ్ టెక్నాలజీస్ హబ్ గా తెలంగాణను తీర్చిదిద్దుతాం

- భవిష్యత్తు మొత్తం 'ఏఐ'దే అన్న శ్రీధర్ బాబు
- సింగపూర్ కాన్సులేట్ జనరల్ బృందంతో భేటీ
- సింగపూర్ తో కలిసి పనిచేసేందుకు సిద్ధమని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దే అని తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు ఈరోజు శ్రీధర్ బాబును సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి శ్రీధర్ బాబు వివరించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ కు తెలంగాణను హబ్ గా మారుస్తున్నామని చెప్పారు. ఏఐ రంగంలో



వివరాలు 2లో..

## తెలంగాణ సచివాలయంలో మీనాక్షి షాడో ముఖ్యమంత్రిగా సమీక్షలు చేస్తున్నారు

- రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గోల్లు గిల్లుకుంటున్నారని ఎద్దేవా
- ఏఐసీసీ పెద్దల దృష్టిలో రేవంత్ రెడ్డి బీజేపీ కోవర్టు అని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి తోకను కత్తిరించి పక్కన పెట్టారని వ్యాఖ్య
- కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారని వ్యాఖ్య



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

## ఆరోగ్యశ్రీని వదిలించుకుంటారా? కూటమి ప్రభుత్వంపై అనుమానాలు

ఏపీలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. బకాయిలు పేరుకుపోవడంతో సోమవారం నుంచి ఎన్టీఆర్ హెల్త్ కేర్ (ఆరోగ్యశ్రీ) పథకం కింద వైద్యం చేయలేమని నెట్ వర్కు ఆస్పత్రులు చేతులెత్తశాయి. దాదాపు రూ.3,500 కోట్లు బకాయి పెట్టడంతో తాము ఆస్పత్రులు నడపలేకపోతున్నామని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటించింది. సిబ్బందికి జీతాలు చెల్లించలేపోవడంతోపాటు శస్త్రచికిత్సలకు అవసరమైన సామగ్రిని కొనలేకపోతున్నామని చెబుతోంది. బకాయిలు చెల్లించాలని కూటమి ప్రభుత్వానికి 26 లేఖలు రాసినా దేనికీ స్పందించలేదని, ఈ పరిస్థితుల్లో బంద్ చేయడం తప్ప మరో మార్గం లేదని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయకుమార్ స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు పెరిగిపోవడంతో సోమవారం నుంచి ఎన్టీఆర్ హెల్త్ కేర్ సేవలు నిలిపివేశారు. బకాయిలు విడుదల చేయకపోతే సమ్మె చేస్తామని గత నెల 7న ప్రభుత్వానికి నెట్ వర్కు ఆస్పత్రులు లేఖ రాశాయి. కానీ, ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ రోజు నుంచి సమ్మె చేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. ఏపీలో మొత్తం రూ.3,500 కోట్లు బకాయి పేరుకుపోయినట్లు ఆయన చెప్పారు. ఇందులో దాదాపు రూ.2,500 కోట్లు గత వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సినదేనని ఆయన వెల్లడించారు. కనీసం రూ.1,500 కోట్లు అయినా చెల్లించి ఆస్పత్రులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేదని, అందుకే సమ్మెకి దిగినట్లు చెప్పారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో రోగుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతానికి అత్యవసర వైద్యం అందిస్తున్నా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆ సేవలు కొనసాగించలేమని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు తేల్చిచెబుతున్నాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం ఆస్పత్రులు నడపలేకపోతున్నామని అంటున్నారు. మందులు, శస్త్రచికిత్స పరికరాల సామగ్రి సరఫరాదారులు కూడా తమకు డెలివరీలను నిలిపివేశారని చెబుతున్నారు. 2025-26 బడ్జెట్ లో ఆరోగ్యశ్రీకి రూ.4 వేల కోట్లు కేటాయించారని, అయితే తమకు పాత బకాయే సుమారు రూ.3,500 కోట్లు ఉందని నెట్ వర్కు ఆస్పత్రులు వాపోతున్నాయి. కేటాయించిన బడ్జెట్ ప్రకారమైనా తమకు నిధులు సర్దుబాటు చేయాలని వేడుకుంటున్నాయి. అయితే, ప్రైవేటు ఆస్పత్రులు ఎంత ఒత్తిడి చేసిన ప్రభుత్వం స్పందించకపోవడానికి ప్రధాన కారణం రాష్ట్రం ఆరోగ్యశ్రీని వదిలించుకోవాలని చూస్తుండటమేనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ లో ఆరోగ్యశ్రీని విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ కార్యదర్శి అవినాష్ ఆరోపించారు. ఆయుష్మాన్ భారత్ లో తక్కువ ప్యాకేజీ రేట్లు ఉన్నాయని, దాదాపు 1500 వ్యాధులను మాత్రమే కవర్ చేస్తుందని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ వల్ల రోగులకు అందే వైద్యం నాణ్యత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ప్రభుత్వ తీరుపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. రైజింగ్ ఏపీ అని పిలుచుకుంటూ పేదలకు ప్రాథమిక వైద్యం అందించలేకపోవడంపై ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీలో రూ.3,500 కోట్లు బకాయి పేరుకుపోవడం అవమానకరంగా ఉందన్నారు. గత తొమ్మిది నెలలుగా బకాయిలు చెల్లించకపోవడం పేదల ఆరోగ్యంపై ప్రభుత్వ చిత్తశుద్ధిని బయటపెట్టిందన్నారు. ఆరోగ్యశ్రీని నిరంతరం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, బకాయిలు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## బనకచర్ల సంగతేంది..వివరాలున్నా ఎందుకు దాస్తుండ్రు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్: గోదావరి నదిపై ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు అంశం జీఆర్ఎంబీ మీటింగ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఇవాళ గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఏకే ప్రధాన్ అధ్యక్షతన జలసౌధలో జీఆర్ఎంబీ సమావేశం జరిగింది. ఏపీ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ ప్రస్తావించింది. ఏపీ ప్రభుత్వం సమాచారం, వివరాలు దాచిపెడుతోందని ఆరోపించింది. ప్రాజెక్టు అంశంపై బోర్డుకు కేంద్రం నుంచి లేఖ వచ్చి 5 నెలలు గడిచాయని, కేంద్రం నుంచి లేఖలు వచ్చినా తమకు కనీస సమాచారం ఇవ్వలేదని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దానివల్ల తెలంగాణపై ప్రభావం తదితర వివరాలు అందించాలని తెలంగాణ అధికారులు జీఆర్ఎంబీని కోరారు. బనకచర్ల పై గతేడాది డిసెంబర్ 10న బోర్డుకు ఏపీ నుంచి సమాచారం వచ్చిందని, బోర్డుకు ఇన్ పుట్ ఉన్నా తమకు సమాచారం ఇవ్వలేదని తెలంగాణ అధికారులు ఆరోపించారు. ప్రాజెక్టులపై ఇన్ పుట్స్ ఇవ్వకుండా పనులు చేస్తామంటే కుదరని తెలిపింది. ఫ్లడ్ వాటర్ పేరుతో 40 వేల క్యూసెక్కులు తీసుకెళ్తామని అంటున్నారని, ఈ పేరుతో తెలంగాణ అలొకేటెడ్ వాటర్ తీసుకెళ్లే ప్రమాదం ఉందని ఆరోపించారు.

ఇంకా ప్రతిపాదన దశలోనే ఉందని.. డీపీఆర్ ఇంకా తయారు కాలేదని ఏపీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ వ్యవహార శైలిని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే బోర్డు సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా జీఆర్ఎంబీలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఏపీ, తెలంగాణకు చెందిన అధికారులను అజగేషన్ వేధిస్తున్నారని, మహిళా ఉద్యోగులను అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమావేశంలో తెలంగాణ నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ ఏఐ వీడియోలు పోస్టు చేశారని బీఆర్ఎస్ నాయకులపై కేసు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములకు సంబంధించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వీడియోలు, ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారనే ఆరోపణలపై గచ్చిబౌలి పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్, థామస్ అగస్టీన్‌లపై కేసులు నమోదు చేశారు. ఏఐ వీడియోలు, ఫొటోలు పోస్టు చేశారంటూ గచ్చిబౌలి పోలీసులు ఇదివరకే 7 కేసులు నమోదు చేశారు. ఏఐ ఫొటోలను సృష్టించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ సోషల్ మీడియా, ఐటీ టీమ్ సభ్యులను కూడా నిందితులుగా చేర్చారు. వీరితో పాటు హెచ్‌సీయూ వద్ద ఆందోళన చేపట్టిన బీజేపీ, ఏబీవీపీ, సీపీఎం కార్యకర్తలు సహా సుమారు 150 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్ రెడ్డి, ధ్రువ్ రాఠీ, రవీనా టాండన్, జాన్ అబ్రహం, దియా మీర్జా సహా మరికొందరు ప్రముఖులపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉందని సమాచారం.

## తెలంగాణలో నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు రఘునందన్ రావు, డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అద్దంకి దయాకర్ కూడా శాసనమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరుల సహకారంతో తనకు ఈ అవకాశం లభించిందని ఆయన అన్నారు.

## ఆక్వా రంగంపై అమెరికా సుంకాల ప్రభావం తాత్కాలికమే

**పెన్ పవర్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయం ఏపీలోని ఆక్వారంగంపై కూడా పడింది. దీనిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. ఆక్వా రంగంపై అమెరికా టారిఫ్ ల ప్రభావం తాత్కాలికమేనని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆక్వా సమస్యలపై మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన నేడు కీలక సమావేశం జరిగింది. ఆక్వా రంగ నిపుణులు, వ్యాపారులు, అధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. అమెరికా సుంకాలు, ఆక్వా రంగానికి ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఆక్వా రంగాన్ని తిరిగి గాడిన పెట్టేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. దిగుమతులపై ఆధారపడకుండా దేశీయ ఆక్వా ఉత్పత్తులను సద్వినియోగం చేసుకుందాం అని సాగుదారులకు పిలుపునిచ్చారు. రైతులు, సీడ్స్ ఉత్పత్తిదారులు, నిపుణులు, ఫీడ్ తయారీదారులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

## తెలంగాణ సచివాలయంలో మీనాక్షి షాడో ముఖ్యమంత్రిగా సమీక్షలు చేస్తున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సచివాలయంలో షాడో ముఖ్యమంత్రిగా సమీక్షలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. నిజామాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గోళ్లు గిల్లుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రాజ్యాంగేతర శక్తుల ప్రమేయం పెరిగిందని ఆరోపించారు. ఏఐసీసీ పెద్దల దృష్టిలో రేవంత్ రెడ్డి బీజేపీ కోవర్టు అని, ఆయనను రాహుల్ గాంధీ కూడా నమ్మడం లేదని అన్నారు. అందుకే రేవంత్ రెడ్డి తోకను కత్తిరించి పక్కన పెట్టారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిని అదుపు చేసేందుకు రాహుల్ గాంధీ దూతగా మీనాక్షి నటరాజన్ వచ్చారని అన్నారు. ఆమె ఏ హోదాలో సచివాలయంలోకి అడుగు పెట్టారో చెప్పాలని నిలదీశారు. సచివాలయంలో సమావేశాలు పెట్టాల్సిన ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో, గాంధీ భవన్‌లో సమావేశాలు పెట్టాల్సిన మీనాక్షి నటరాజన్ సచివాలయంలో పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి పదవిని కాపాడుకునేందుకు బడేబాయ్‌తో చోటేబాయ్ స్నేహం చేశారని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో డీల్ చేసుకున్నాకే తెలంగాణలోని విశ్వవిద్యాలయాల భూములను అమ్మకానికి పెట్టారని మండిపడ్డారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ లాంటి వారు ముఖ్యమంత్రికి రక్షణ కవచంలా నిలుస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో తాకట్టు పెట్టారని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్రానికి బీఆర్ఎస్ ఇంటి పార్టీ అని, అలాంటి పార్టీని ఓడించినందుకు ఇప్పుడు బాధపడుతున్నారని అన్నారు. ఎన్నికల హామీలలో దాదాపు అన్నింటికి ఎగనామం పెట్టారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యమంటేనే హామీలకు సమాధి అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి అమ్ముడుపోవడం అలవాటేనని, అందుకే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బడే భాయ్‌కి చోటే భాయ్ తోఫా ఇచ్చాడని చురక అంటించారు. కేసీఆర్ అంటే నమ్మకం, మోదీ, రేవంత్ రెడ్డి అంటే అమ్మకమని తెలంగాణ ప్రజలు గుర్తించారని అన్నారు. హెచ్‌సీయూ భూములని అమ్ముకోనిస్తే రేవంత్ రెడ్డికి పట్టపగ్గాలుండవని హెచ్చరించారు. విశ్వవిద్యాలయాల భూముల అమ్మకం తర్వాత కళాశాలల భూముల అమ్మకానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ భూములను ఎవరైనా కొనుగోలు చేస్తే, తాము అధికారంలోకి వచ్చాక వాటిని తిరిగి తీసుకుంటామని కేటీఆర్ చెప్పారని గుర్తు చేశారు.

## ముఖ్యంగా ఈ మూడు తగ్గిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవు

- మొదటి పేజీ తరువాయి

ఇటీవల రూపొందించిన న్యూట్రిఫుల్ యాప్ కు స్కోచ్ అవార్డు లభించింది. ఈ యాప్ ను 4 లక్షల మంది డౌన్ లోడ్ చేసుకున్నారు" అని వివరించారు. కాగా, రాష్ట్రంలో పెరిగిన వైద్య ఖర్చులు, పలు రకాల జబ్బులపై ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో చంద్రబాబు వివరించారు. అమరావతిలో గ్లోబల్ మెడిసిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకలు ఉండే ఆసుపత్రులు నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. కుప్పంలో డిజిటల్ హెల్త్ సర్వే సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. గుండె జబ్బులు, డయాబెటిస్, హైపర్ టెన్షన్, శ్వాసకోశ వ్యాధుల వంటి సమస్యలు కొన్ని చోట్ల విస్తృతంగా పెరుగుతున్నాయని సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పురుషుల కంటే మహిళల్లో అధికంగా హైపర్ టెన్షన్ కనిపిస్తోందని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్ల వల్ల కొన్ని జిల్లాల్లో మధుమేహం ఎక్కువగా ఉందని వెల్లడించారు.

## అమరావతికి రూ.4200 కోట్లు రిలీజ్ చేసిన కేంద్రం

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రం తాజాగా నిధులు విడుదల చేసింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ మద్ధతుతో అమరావతికి రూ.4200 కోట్లు రిలీజ్ చేసినట్లు ప్రకటించింది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర అభివృద్ధితో పాటు అమరావతి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. నిధుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా అమరావతి అభివృద్ధికి నిధులు విడుదల చేసింది. పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టులకు సైతం చేయూతనిచ్చింది.

వేల కోట్ల నిధులను ఇప్పటికే అందించింది. ఈ విషయంపై కూటమి పార్టీల ఎంపీలు మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ల కృషి వల్లే రాష్ట్రానికి నిధులు వస్తున్నాయని చెప్పారు. తాజాగా విడుదల చేసిన నిధులతో ఏపీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సామాన్యులకు షాక్... భారీగా గ్యాస్ ధరల పెంపు!

**పెన్ పవర్ డెస్క్:** వంట గ్యాస్ ధరను పంపిణీ సంస్థలు సిలిండర్‌కు రూ.50 పెంచాయని కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పూరి సోమవారం వెల్లడించారు. జనరల్ కేటగిరీ వినియోగదారులతో పాటు ఉజ్వల పథక లబ్ధిదారులకు కూడా ఈ పెంపు వర్తిస్తుందన్నారు. రేపటి నుంచే కొత్త ధరలు అమల్లోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ పెంపుతో 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర సాధారణ వినియోగదారులకు రూ. 803 నుంచి రూ. 853కు, ఉజ్వల్ సిలిండర్ రూ. 503 నుంచి రూ. 553కు చేరనుంది. అటు... పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, ఆ భారాన్ని చమురు కంపెనీలే భరించనున్నాయి.

## యువతకు ఉద్యోగాలు ఇవ్వండి

- మొదటి పేజీ తరువాయి

బీహార్ యువత సంసిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం చివరలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇటీవల రాష్ట్రంలోని 40 సంస్థాగత జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాలను రూపొందిస్తోంది.

## రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ కలెక్టర్ మృతి

**పెన్ పవర్ డెస్క్:** ఏపీలోని అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. సంబేపల్లి మండలం యర్రగుంట్ల వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హెచ్ఎన్ఎస్ పీలేరు యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. రాయచోటి కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు వెళ్లి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. క్షతగాత్రులను కలెక్టర్ శ్రీధర్ పరామర్శించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పును నేను అంగీకరించను

**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమ బెంగాల్ లో 25 వేల ఉపాధ్యాయుల నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. కొత్త నియామకాలను చేపట్టాలని బెంగాల్ ప్రభుత్వానికి సూచనలు చేసింది. సుప్రీం తీర్పుపై ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును తాను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోనని అన్నారు. తనను జైల్లో పెట్టినా సరే... సుప్రీం తీర్పును అంగీకరించనని చెప్పారు. ఇలా మాట్లాడుతున్నందుకు కోర్టు ధిక్కరణ కింద తనను జైల్లో పెట్టొచ్చని అన్నారు. తాను బతికున్నంత కాలం ఎవరూ ఉద్యోగం కోల్పోరని చెప్పారు. అందరి ఉద్యోగాలను కాపాడే బాధ్యత తనదని అన్నారు. తనను సవాల్ చేసే వాళ్లకు సమాధానం ఎలా చెప్పాలో తనకు తెలుసని చెప్పారు.

## ఎమర్జింగ్ టెక్నాలజీస్ హబ్ గా తెలంగాణను తీర్చిదిద్దుతాం

- మొదటి పేజీ తరువాయి

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలను నెలకొల్పుతున్నామని చెప్పారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీతో పాటు ఇతర రంగాల్లో 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటును కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... కరీంనగర్, వరంగల్ లాంటి నగరాలకు కూడా విస్తరిస్తున్నామని చెప్పారు. స్కిల్ డెవలప్ మెంట్, టెక్నాలజీ రంగాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

# లిఫ్ట్ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**హైదరాబాద్: పెన్ పవర్:**
హైదరాబాద్లో మరోసారి లిఫ్ట్ ప్రమాదం తలెత్తింది. ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటి మజీద్ ఎదురుగా ఉన్న ఓ అపార్ట్మెంట్లో ఐదవ అంతస్తు నుండి ఒక్కసారిగా మొదటి అంతస్తులోకి లిఫ్ట్ పడిపోయింది. ప్రమాద సమయంలో లిఫ్ట్లో ఆరుగురు ఉన్నారని ఇందులో ముగ్గురు చిన్నారులు ముగ్గురు పెద్దలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో చిన్నారులకు ఎలాంటి హాని జరగలేదని లిఫ్ట్ లో ఉన్న ముగ్గురు పెద్దలకు మాత్రం ఒకరికి వెన్నుపూస మరి ఇద్దరికీ కాళ్లు ఫ్రాక్చర్ అయినట్లు నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ తెలిపారు. గాయపడ్డ వారిని పరామర్శించేందుకు ఆయన హుటాహుటిన ఓ ప్రైవేట్ హాస్పిటల్ కి చేరుకొని వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ మెయింటెనెన్స్ కోసం డబ్బులు తీసుకున్నప్పుడు కచ్చితంగా మెయింటెనెన్స్ చేయాలని అపార్ట్మెంట్ యజమానులకు సూచించారు. కేసు నమోదు చేసుకొని ఆసిఫ్ నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆహారకల్తీ రెండో స్థానంలో తెలంగాణ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆహార కల్తీలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది ఆహార భద్రత అధికారులు గత నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 22 శాతం కల్తీవే ఉండటం గమనార్హం. 2021-24 మధ్య దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార పదార్థాల నమూనాలు, అందులో కల్తీవిగా తేలిన నమూనాల వివరాలను కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్రాల వారీగా ఇటీవల పార్లమెంటుకు నివేదించింది.
ఈ లెక్కల ప్రకారం ఆహార కల్తీలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది. తెలంగాణలో సేకరించి పరీక్షించిన ప్రతి 100 నమూనాల్లో 14 కల్తీ ఆహారంగా తేలుతున్నాయి. తమిళనాడు 20 శాతం సగటుతో దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రస్థానంలో ఉంది. కేరళ 13.11 శాతం, ఆంధ్రప్రదేశ్ 9 శాతం, కర్ణాటక 6.30 శాతంతో వరుసగా తర్వాత స్థానాల్లో నిలిచాయి.

## కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం:



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర శాసనమండలి వేదికగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు సోమవారం ప్రమాణ్య స్వీకారం చేశారు. పట్టభద్రులు, టీచర్, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలువురు సభ్యులు ఎమ్మెల్సీలుగా ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్తగా ఎనిమిది మంది ఎమ్మెల్సీలు ఎన్నికయ్యారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీపాల్ రెడ్డి, శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం, మల్కా కొమురయ్య, అంజి రెడ్డి తదితరులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ ఏవిన్ రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.
ముగిసిన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం
కాగా ఏడుగురు ఎమ్మెల్సీలు మాత్రమే ప్రమాణస్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనా దాసోజు శ్రవణ్ మరో రోజు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా ఎమ్మెల్యే కోటాలో కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్నాయక్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్య విజయం సాధించారు. అలాగే ఖమ్మం టీచర్ ఎమ్మె

**బీజేపీ ఎమ్మెల్సీ అంజి రెడ్డి కామెంట్స్:**
ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన అనంతరం బీజేపీ ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్సీ గా గెలిచినందుకు సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాయకత్వానికి, గెలిపించిన ప్రతి కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యలపై మండలిలో గొంతు విప్పుతానన్నారు. విద్యాసంస్థలకు పెండింగ్లో ఉన్న బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెచ్సీయూ భూములు అమ్మాలని ప్రభుత్వం చూస్తోందని, విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**మరో బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ.**
ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన మరో బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ. తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్ర నాయకత్వానికి, కేంద్ర నాయకత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వం అని రుజువు అయిందన్నారు. కలిసి కట్టుగా పని చేసి రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# హెచ్సీయూ భూములపై హైకోర్టు విచారణ వాయిదా

**హైదరాబాద్ పెన్ పవర్:** హెచ్సీయూ భూ వివాదంపై సోమవారం హైకోర్టులో విచారణ వాయిదా పడింది. ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది ధర్మాసనం. ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని డివిజన్ బెంచ్ పేర్కొంది. ఈ కేసులో కౌంటర్, రిపోర్ట్ ఈనెల 24లోగా సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. హెచ్సీయూ భూముల వివాదంపై సుప్రీం కోర్టు, హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో హైకోర్టులో హెచ్సీయూ భూములపై విచారణ జరుగగా.. పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీం కోర్టులో కేసు విచారణ దశలో ఉన్నందున ఈనెల 24కు వాయిదా వేస్తూ తెలంగాణ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. 24 లోపు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించారు. అలాగే స్టేటస్ రిపోర్టు ఫైల్ చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయవాది తన వాదనలు వినిపించారు. దీంతో ఫేక్ వీడియో, ఫారెస్ట్ తగుల బెట్టిన వీడియోలపై ఇప్పటికే గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. వాటికి సంబంధించి ఇన్వెస్టిగేషన్ రిపోర్టుపై పోలీసులే కౌంటర్ దాఖలు చేస్తారని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టు తెలిపడంతో.. తదుపరి విచారణ 24కు వాయిదా వేసింది హైకోర్టు.మరోవైపు కంచ గచ్చిబౌలి భూములపై ఏఐని ఏఐ, ఉపయోగించి కొన్ని సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేయడంపై గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదు చేశారు. అందులో భాగంగా బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ కు పోలీసులు నోటీసులు ఇచ్చారు.

# పారిశుద్ధ్య కార్మికులందరికీ బీమా ప్రీమియం

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లాలో పనిచేస్తున్న సుమారు 2700 పారిశుధ్య కార్మికులందరికీ బీమా ప్రీమియం చెల్లించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. మరణించిన ఇద్దరు పారిశుద్ధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ చెక్కులు పంపిణీ చేశారు. ఇల్లందకుంట మండలం మల్యాల కు చెందిన గురుకొండ రాజబాబు, శ్రీరాముల పల్లెకు చెందిన తిరుపతి మరణించగా వారి కుటుంబ సభ్యులకు పి.ఎం.జె.జె.బి.వై పథకం ద్వారా మంజూరైన రూ.రెండు లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఇందుకు సంబంధించిన ప్రీమియం గత ఏడాది జిల్లా యంత్రాంగమే చెల్లించింది.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. గత సంవత్సరంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లాలోని సుమారు 2700 మంది పారిశుద్ధ్య కార్మికులకు బీమా ప్రీమియం చెల్లించామని గుర్తు చేశారు. కార్మికుల నుండి ఒక్క రూపాయి తీసుకోకుండా సుమారు పది లక్షల రూపాయల వరకు బీమా చెల్లి ప్రీమియం చెల్లించిందని అన్నారు. వివిధ కారణాలవల్ల కార్మికులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు.
ఈ ఏడాది కూడా కార్మికులందరికీ బీమా ప్రీమియం జిల్లా యంత్రాంగం ద్వారానే చెల్లించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు నిర్వహించి కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని, అందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని అన్నారు. గతంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపుల ద్వారా కొందరు పారిశుధ్య కార్మికుల్లో టీబీ వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తున్నామని, న్యూట్రిషన్ కిట్టు తో పాటు ప్రతి నెలా వేయి రూపాయలు అందజేస్తున్నామని అన్నారు.




ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కార్మికులకు రూ.20 లక్షల బీమా ప్రీమియం చెల్లించిన మున్సిపల్ కమిషనర్ ఆయూబ్ ను అభినందించారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డిటిడిఓ పవన్ కుమార్, ఆర్డిఓ మహేశ్వర్, యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్ స్వామి, ఎల్డీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

# సామాజిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మాత్తుగా సందర్శించిన. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్.

**హైదరాబాద్ పెన్ పవర్:** రామగుండం లోని సామాజిక సంక్షేమ బాలికల పాఠశాలను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ గురువారం నాడు ఆకస్మితంగా తనిఖీ చేశారు.
పాఠశాలలో ఉన్న వసతులను స్వయంగా పరిశీలించారు.
విద్యార్థుల జీవన నిబద్ధత, ఆహార వసతి, తరగతుల నిర్వహణ, హాస్టల్ పరిపాలన తదితర అంశాలపై నేరుగా విద్యార్థులతో మాట్లాడి సమాచారం సేకరించారు.
విద్యార్థుల అభిప్రాయాలను బట్టి విద్యా ప్రమాణాలు మెరుగుపడాలనే దృష్టితో విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యతను పరీక్షించి, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై అధికారులు ఎంతవరకు శ్రద్ధ వహిస్తున్నారన్న విషయాన్ని ఆయన సమీక్షించారు.
ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ %-% ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకోవడం అనేది అత్యంత అవసరం. వసతుల లోపం వల్ల విద్యార్థుల భవిష్యత్ దెబ్బతినకూడదు. అందుకే ఇలా అకస్మాత్తుగా వచ్చి మౌలిక సదుపాయాలు పరిశీలించా. ఏ లోపాలైనా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా" అని హామీ ఇచ్చారు.
అలాగే, విద్యార్థులు నిస్సంకోచంగా తమ సమస్యలను వెల్లడించగలిగేలా ఒక శ్రవణ విధానం ఏర్పాటు చేయాలన్న సూచనలను సంబంధిత అధికారులకు ఇచ్చారు.
ఈ సందర్శనలో ఎమ్మెల్యే తో పాటు కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, కాం పెల్లి సతీష్, స్థానిక అధికారులు, పాఠశాల సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లాలోని అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కురవి మండలం, రాజోలు గ్రామానికి చెందిన తాటిపాముల వర్దయ్య తన భార్య ఉపాధి హామీ పనులు నిర్వహిస్తూ ప్రమాద వశాత్తు చని పోయిందని ప్రభుత్వం నుండి ఏదైనా ఆర్థిక సహాయం చేయాలని దరఖాస్తు చేసారు. గూడూరు మండలం, ఏపూరి గ్రామానికి చెందిన బానోతు చందు మండలంలో అక్రమంగా ఫంక్షన్ హాలు నిర్మించారని దానిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. తొర్రూరు మండలం కాకతీయ కాలనీకి చెందిన దాసరోజు వినోద తాను నిరుపేద కుటుంబానికి చెందిన వారినని రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా తనకు ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేశారు. జిల్లాలోని ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని, రాజీవ్ యువ వికాసం పథకం లో ప్రాధాన్యత కల్పించాలని, గిరిజన జర్నలిస్టు పిల్లలకు ఈ ఎం ఆర్ ఎస్ పాఠశాలలో విద్య కల్పించాలని దరఖాస్తు చేశారు. ఈ సోమవారం రెవెన్యూ విభాగానికి చెందిన దరఖాస్తులు (37), డి ఆర్ డి ఏ (5), వ్యవసాయం, (3) బీసీ వెల్ఫే ర్ (2), పంచాయతీరాజ్ (4), ఇలా వివిధ విభాగాలకు చెందిన మొత్తం (75) దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు . ఈ ప్రజావాణి కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణవేణి, గణేష్, జడ్పీ సీఈవో పురుషోత్తం, డి ఆర్డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధు సూదన రాజు, బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.నరసింహస్వామి, డిసిఓ వెంకటేశ్వర్లు, డి వి హెచ్ ఓ డాక్టర్ బి. కిరణ్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ భీమ్లా నాయక్, డిహెచ్ఓ జి. మరియన్న డిపిఓ హరిప్రసాద్, డి డబ్ల్యూ ఓ దేశీ రామ్, మెప్మా పీడీ విజయ, డి ఎస్ ఓ ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డి డబ్ల్యూ ఓ ధనమ్మ, ఏడి మైనింగ్ వెంకటరమణ, మత్స్యశాఖ అధికారి వీరన్న, జీఎం ఇండస్ట్రీస్ శ్రీమన్నారాయణ రెడ్డి, ఏడి రాజేశం, ఉపాధి కల్పన అధికారి రజిత, ఈ డబ్ల్యూ ఐడి సి డిఈ అరుణ్ కుమార్, మైనారిటీ అధికారి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేటర్ ఈడి శ్రీనివాస్, ఎల్డిఎం మూర్తి, డిఎం మార్కెటింగ్ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, అన్ని మండలాల నుండి ఉప తహసిల్దార్ లు, మున్సిపల్ మేనేజర్లు, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా విద్యార్థులు అమరావతిలో ఉద్యోగ, వ్యాపార అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- **ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)**
- **మేరీస్ స్టెల్లా కాలేజీ లో నావిగేట్ ది కెరియర్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ ప్రొగ్రామ్**
- **ముఖ్యఅతిథిగా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) హాజరు**
- **డిగ్రీ ఫైనలియర్ స్టూడెంట్స్ తో ఎంపి కేశినేని శివనాథ్ ఇంటరాక్షన్**
- **జక్కంపూడి లో ఎలీప్ సంస్థకు లక్ష చదరపుఅడుగుల స్థలం**
- **ఐదు నెలల్లో లైట్ ఇండస్ట్రీయల్ ఏరియా అభివృద్ధి**
- **కేశినేని ఫౌండేషన్ ద్వారా కెరియర్ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు**
- **ది స్కిల్ షాప్ వారితో విద్యార్థులకు కెరియర్ కౌన్సిలింగ్**
- **ఉద్యోగ, వ్యాపార అవకాశాలు వివరించిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)**
- **విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచన**

హైదరాబాద్ పెన్ పవర్:
విజయవాడ చాలా మంది లేడీ ఎంటర్ ప్రెన్యూర్స్ ను తయారు చేసింది. కానీ చాలా ఎంటర్ ప్రెన్యూర్స్ అవకాశాలు లేక హైదరాబాద్, అమెరికా, బెంగుళూర్, మద్రాసులోనూ పరిశ్రమలు నడిపిస్తున్నారు. ఇక్కడ వున్న మహిళ విద్యార్థులు ఉద్యోగ,వ్యాపార అవకాశాల కోసం ఎక్కడికో వెళ్లటం ఇష్టం లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి రాజధాని ప్రాంతంలో రాబోయే అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. మేరీస్ స్టెల్లా కాలేజీ లో ఫైనలియర్ స్టూడెంట్స్ కి సోమవారం ఏర్పాటు చేసిన నావిగేట్ ది కెరియర్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ ప్రొగ్రామ్ కి ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ విద్యార్థులతో ఇంటరాక్షన్ అయ్యారు. మైక్రో బయోలాజీ చదివే దివ్య, టూరిజం చదివే సిఫ్రా, లైఫ్ సైన్స్ చదివే ప్రియ, అగ్రికల్చర్ బి.యస్సీ చదివే మాధురీ, బి.ఎ చదివే ఐశ్వర్య, బి.ఎ జర్నలిజం చదివే హర్షిణి ఉద్యోగావకాశాలు, ఎంటర్ ప్రెన్యూర్స్ గా కావటానికి ప్రభుత్వం అందించే సహకారం గురించి అడిగిన ప్రశ్నలకు ఎంపి కేశినేని శివనాథ్ సవివరంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులకి కెరియర్ గైడెన్స్ అందించే దిస్కిల్ షాప్ కి చెందిన కెరియర్ కౌన్సిలర్ ను పిలిపించి విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేయించారు. అలాగే విద్యార్థులు ఏ రంగంలో ఆసక్తి వున్నారో తెలుసుకుని చెప్పాలని, వారికి ఆరంగంలో నైపుణ్యత పెంపొందించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేయిస్తానన్నారు. కేశినేని ఫౌండేషన్ ద్వారా విద్యార్థుల కోసం కెరియర్ కౌన్సిలర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
ఎంపి కేశినేని శివనాథ్ విద్యార్థులతో ఇంటరాక్షన్ సందర్భంగా మాట్లాడుతూ అమరావతిలో చదువుకునే యువతీ యువకులు ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. చంద్రబాబు గారు ఆలోచనల్లో 20 ఏళ్ల ముందువుంటారు. దానికి ఉదాహరణ హైదరాబాద్ లో ఐటి విప్లవం అన్నారు. రాబోయే కాలంలో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవం రానుంది. సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ ను అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారన్నారు. ఇక అమరావతిలో ఇంజనీరింగ్ చదివిన వాళ్లకే కాదు...డిగ్రీ చదివిన వాళ్లకు కూడా మంచి ఉద్యోగ అవకాశాలు వుంటాయన్నారు. కాకపోతే కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమన్నారు.
ఎపిలో ఎన్నో సంస్థలు మెకానికల్ సంస్థలతో పాటు ఆటోమొబైల్ సంస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటిల్ జెన్స్ సంస్థలు, డిఫెన్స్ టెక్నాలజీ పరిశ్రమలు పెట్టబోతున్నట్లు తెలిపారు. వీటికంటే ముందు అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ రాబోతున్నట్లు చెప్పారు. అన్నింటికంటే ముఖ్యంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ పెట్టబోతున్నట్లు వివరించారు.

# శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడమే బిజెపి ముఖ్య సిద్ధాంతం

**పెద్దపల్లి ప్రతినిధి పెన్ పవర్:** బిజెపి ఆవిర్భవ దినోత్సవం పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్ పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి లో మరియు మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలో బిజెపి పార్టీ జెండా ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, బిజెపి నాయకులు మాట్లాడుతూ బిజెపి పార్టీ అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీల నాయకత్వంలో 1980 ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీ స్థాపించబడింది. అటల్ బిహారీ వాజ్‌పేయి భాజపా తొలి అధ్యక్షుడిగా నియమించ బడ్డాయన్నారు. 1980లో ప్రారంభించిన బిజెపి పార్టీ దేశములోని సామాజిక సమరసత, సాంఘిక, సాంస్కృతిక విలువల పరిరక్షన, దృఢమైన జాతీయరక్షణ ధ్యేయంగా మరియు ప్రతి పేద మధ్యతరగతి కుటుంబాలకు మరియు అట్టడుగు స్థాయి ప్రజలకు ప్రభుత్వ అందించే సంక్షేమ పలాలు అందాలని శ్యామాప్రసాద్ ముఖర్జీ వేసిన పునాదులపై నిర్మితమై, దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతావాదానికి కట్టుబడి ఉందని అన్నారు. చివరి పంక్తిలో వ్యక్తికి తొలి పంక్తిలో ఉన్న వ్యక్తి పొందే ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ సిందతం ఆచరిస్తూ అటల్, అద్వానీ తదితర అగ్రనేతల మార్గదర్శనంలో అమిత్ షా, జేపీనడ్డా నాయకత్వంలో ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించి, నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రపంచంలో భరతమాతను విశ్వ గురువుగా నిలిపే యజ్ఞంలో భాగమైనది భారతీయ జనతా పార్టీ దిన్ దయల్ ఉపాధ్యాయ సిద్ధాంతానికి అనుకూలంగా బిజెపి పార్టీ భారతదేశాన్ని శక్తివంతమైన, సౌభాగ్యకరమైన దేశంగా తీర్చిదిద్దడం, భారతదేశపు ఘనమైన ప్రాచీన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడం, దేశాన్ని అభివృద్ధిపథంలోకి పయనింపజేయడం, ప్రపంచంలో భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్ది ప్రపంచశాంతి, అంతర్జాతీయ న్యాయంలో భారత పాత్రను పెంచడం మొదలగునవి బిజెపి పార్టీ బైలా లో ఉన్న కొన్ని విశాలమైన ఆశయాలు ఉన్నాయని వెల్లడించారు. దేశాన్ని ల

శక్తివంతమైన ప్రజాస్వామిక రాజ్యంగా తీర్చిదిద్ది పౌరులందరికీ కుల, మత, లింగ భేదాలు లేకుండా రాజకీయ, ఆర్థిక, సాంఘిక న్యాయాన్ని, స్వేచ్ఛను కల్పించడం పార్టీ ఆశయాలుగా పెట్టుకుంది అన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ అయ్యాక భారతదేశాన్ని ఒక అత్యున్నతమైన పటిష్టమైన ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. జమ్ము కాశ్మీర్లో 37 ఆర్టికల్ రద్దు చేయడం గాని అయోధ్యలో రామ జన్మభూమి నిర్మించడం గాని సి ఏ ఎన్ ఆర్ సి బిల్లును తీసుకురావడంలో గాని, భారత దేశంలో సరిహద్దులో పటిష్టమైన ఆర్మీ ని తయారు చేయడంలో గాని, ఈరోజు ప్రపంచంలో భారత ఆర్మీ వ్యవస్థను టాప్ 5 లో ఉంచడంలో బిజెపి ఏనలేని కృషి చేయడం జరిగిందని అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక పటిష్టమైన దేశంగా తీర్చిదిద్దడమే కాకుండా ఈరోజు భారతదేశ ఆర్థిక వ్యవస్థ గత ప్రభుత్వాలు సాధించలేని విధంగా మెరుగుపడడం జరిగిందని అన్నారు. ఎస్సారెస్పీ కెనాల్ డి 83, డి 86 ద్వారా పెద్దపల్లి జిల్లాకు రెండు తడులు ఇవ్వాలని అన్నారు. అలాగే ప్రస్తుతం పెద్దపల్లి అసెంబ్లీలో డి 83, డి 86 ఎస్సారెస్పి కెనాల్ పారకం పై ఆధారపడి రైతులు లక్షల ఎకరాలలో మొక్కజొన్న, వరి పంట సాగు చేయడం జరిగింది అన్నారు. ప్రస్తుతం ఇంక రెండు తడులు ఇవ్వాలని రైతులు ఎస్సారెస్పీ జిల్లా అధికారులను సంప్రదించగా ఎస్సారెస్పీ నీళ్లు ఇక రావు ఏమన్నా నీళ్లు కావాలంటే పై స్థాయిలో పైరవీలు చేసుకోమని చెప్పి రైతులతో అనడం జరిగిందని అన్నారు. ఒకవేళ నీరు ఇవ్వకుంటే అరుకలం కష్టపడి పంట వేసిన రైతులకు సంబంధించిన వేల ఎకరాలలో వరి మరియు మొక్కజొన్న పంటలు నీళ్లు లేక ఎండిపోయి రైతులు నష్ట పోవాల్సి వస్తదన్నారు. కావున మేము స్థానిక ఎమ్మెల్యే ని మరియు మంత్రి ని, ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతుల పక్షాన ఇంకొక తడి ఇవ్వాలని మేము డిమాండ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తంగెడ రాజేశ్వరరావు, మేకల శ్రీనివాస్, పోల్సని సంపత్, ఈర్ల శంకర్, ఓల్లే తిరుపతి, రాజం మహంత కృష్ణ, ఓదెల మండల అధ్యక్షులు కరేంగుల శ్రీనివాస్, మహేందర్, యాదవ్, కావేటి రాజగోపాల్, ఉప్పు కిరణ్, ముంజ రాజేందర్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఉప్పు హరీష్, గుడ్ల సతీష్ పలువురు పాల్గొన్నారు

# మంగళగిరిని దేశంలోనే నెం.1 నియోజకవర్గంగా తయారు చేస్తా

**ఇచ్చిన ప్రతిమాట నిలబెట్టుకున్నాకే మళ్లీ ప్రజలముందుకు**

**అయిదేళ్లపాటు సేవలతో మంగళగిరి ప్రజల మనసు గెలిచా**

**రూపాయి అవినీతి లేకుండా పేదలకు వెయ్యికోట్ల ఆస్తి పంపిణీ**

**మనఇల్లు - మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్**

**మంగళగిరి: పెన్ పవర్:** మంగళగిరి ప్రజలను నా గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా, భారతదేశంలో నెం.1 నియోజకవర్గంగా మంగళగిరిని చేసే బాధ్యత నేను తీసుకుంటానని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మనఇల్లు %–% మనలోకేష్ కార్యక్రమంలో భాగంగా 3వరోజు యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు ఆవరణలో తాడేపల్లి మండలం కొలనుకొండకు చెందిన 231మందికి, పద్మశాలి బజార్ కి చెందిన 127మంది పేదలకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... 2019 ఎన్నికల్లో తొలిసారి ఎన్నికల్లో మీ ముందు నిలబెడ్డా, నియోజకవర్గంపై పెద్దగా అవగాహన లేదు, మీ సమస్యలు తెలుసుకోలేకపోవడం, కేవలం ఎన్నికలకు 21రోజుల ముందు రావడంతో 5300 ఓట్ల తేడాతో ఓడిపోయా. ఓడినరోజు కొంచెం బాధ పడ్డా. రెండోరోజు నుంచి నాలో కసి పెరిగింది, మంగళగిరి ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాను. అయిదేళ్లపాటు సొంత నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహించా. సొంతగా 26సంక్షేమ కార్యక్రమాలను అమలుచేశా.

సేవా కార్యక్రమాలతో మంగళగిరి ప్రజల మనసు గెలిచా

ఎన్టీఆర్ సంజీవని పేరిట తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల మొబైల్ క్లినిక్ లు ఏర్పాటుచేశా. గ్రామాల్లో పేదల పెళ్లిళ్లకు గౌరవంగా బట్టలు పెట్టడం, ఉచితంగా ట్యాంకర్లతో తాగునీరు, పిల్లలు క్రికెట్ ఆడుకునేందుకు ప్లేగ్రౌండ్స్ ఏర్పాటుచేశాం, మంగళగిరి ప్రీమియర్ లీగ్ నిర్వహించాం. మహిళలు సొంతకాళ్లతో నిలబడాలని శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందజేశాం.

2024లో రెండోసారి మీ ముందుకు వచ్చా.

గెలిస్తే ఎంత చేస్తానో ఆలోచించాలని, 53వేల ఓట్లతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరాను. ఎన్నికలకు ముందు సర్వేలో



కుప్పం కంటే వెనుకబడి ఉన్నాం. ఆ తర్వాత ప్రజల్లో స్పందన చూశాక కుప్పం కంటే ఎక్కువ వస్తుందని చంద్రబాబుగారికి చెప్పాను. ఎవరూ ఊహించని విధంగా 91వేల మెజారిటీతో గెలిపించి శాసనసభకు పంపించారు. మంగళగిరిలో ఓడితే ఇబ్బంది అవుతుందని, 2స్థానాల్లో పోటీచేయమని కొందరు సన్నిహితులు చెప్పారు. 5సంవత్సరాలు కష్టపడి మంగళగిరి ప్రజల మనసులను గెలుచుకున్నా, మంగళగిరి ప్రజల మధ్యే ఉంటానని చెప్పాను.

**రచ్చబండలో ఇచ్చిన హామీ మేరకే పేదలకు పట్టాలు**

ఎన్నికలకు ముందు రచ్చబండ కార్యక్రమానికి వచ్చినపుడు ఎక్కడ నివసించే వారికి అక్కడే రెగ్యులరైజ్ చేయమని స్థానికులు నాకు విజ్ఞప్తిచేశారు. వారికి ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు 3వేలమందికి పట్టాలు అందజేస్తున్నాం. రెండోవిడతలో రైల్వే, ఎండోమెంట్ భూముల్లో నివసించేవారికి ఏడాది లోగా అందజేస్తాం. జటిలమైన అటవీ భూములు, ట్యాంక్ బండ్ లపై నివసించేవారికి 3వవిడతలో 3ఏళ్లలో తప్పనిసరిగా శాశ్వత పట్టాలు అందజేస్తా. ఎపి చరిత్రలో ఎక్కడా లేనివిధంగా మంగళగిరి కోసం జిఓ తెస్తే అది అందరికీ ఉపయోగపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా రెగ్యులరైజేషన్ కోసం 7వేలమంది దరఖాస్తుచేయగా, అందులో 4వేలమంది మంగళగిరి ప్రజలు ఉన్నారు. ఈరోజు 3వేలమందికి పట్టాలు ఇస్తున్నాం. పట్టాలు పొందిన లబ్ధిదారులు వాటిని రిజిస్టర్ చేసుకోవచ్చు, కుటుంబ అవసరాల కోసం పట్టాలు అమ్ముకునే హక్కు కూడా కల్పిస్తున్నాం. 5రోజుల్లో వెయ్యికోట్ల విలువైన భూములను ఉచితంగా అందిన్నాం. పేదల పట్టాల అంశాన్ని 2వ కేబినెట్ లో అప్రూవల్ తెచ్చాను.

**పారదర్శకంగా రూ.వెయ్యికోట్ల ఆస్తి పంపిణీ**

రచ్చబండలో ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నా. మంగళగిరి ప్రజల చిరకాల కోరిక అయిన వందపడకల ఆసుపత్రికి ఈనెల 13వతేదీన శంకుస్థాపన చేస్తాం. ఈ హాస్పటల్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేసే బాధ్యత ఎపిఎస్ఎంఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ది. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో పోలీస్ స్టేషన్లు, పార్కులు, చెరువులు, చేనేత కార్మికులకు క్లస్టర్, స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నాం. వచ్చే ఎన్నికల్లో మళ్లీ మీ వద్దకు వచ్చేటప్పుడు ఇచ్చిన ప్రతిమాట నిలబెట్టుకున్న తర్వాతే మీ ముందుకు వస్తా, అదే నా లక్ష్యం. నియోజకవర్గ ప్రజలంతా ఒక్కసారి ఆలోచించండి. మీ ఇల్లు కొలతలు తీసుకోవడానికి వచ్చినపుడు జనసేన, టిడిపి, బిజెపి నాయకులు ఎవరివద్దా ఒక్క కప్పు కాఫీ తాగలేదు. స్వచ్ఛందంగా మీకు సేవచేయడానికి వచ్చారు. ఒక్కరూపాయి అవినీతిలేకుండా వెయ్యికోట్ల ఆస్తి పేదలకు అందించాం, అది ఎన్ డిఏ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి లోకేష్ చెప్పారు.

# తెలంగాణ యువతను నైపుణ్య మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్:** పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అన్ని రంగాల్లో అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చి దిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్ఐసీ)లో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం యూనివర్సిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులకు చిరునామాగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ యువతలో ప్రతిభకు కొదవ లేదని... మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ లో

శిక్షణ అందిస్తే మరింత మెరుగ్గా తయారవుతారన్నారు. పరిశ్రమలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ... కోర్సుల రూపకల్పనలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సాఫ్ట్ స్కిల్స్ లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. కోర్సు పూర్తయ్యే నాటికి అభ్యర్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చి దిద్దాలన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యా, పరిశోధన, టాస్క్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) తదితర సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా, స్కిల్ యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, ఓఎస్డీ చమాన్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సుంకులాపరమేశ్వరి, వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మండల కేంద్రమైన తుగ్గలిలో ఆదివారం రోజున శ్రీ సుంకలాపరమేశ్వరి,వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టలను సోమవారం రోజున గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ముందుగా తుగ్గలిలో గల ఎస్సీ కాలనీ యందు సుంకులమ్మ ఆలయాన్ని ఆధునికరించి నూతనంగా సుంకలాపరమేశ్వరి విగ్రహాన్ని వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలను నిర్వహించి గ్రామ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. అదేవిధంగా తుగ్గలిలోని గ్రామ విఆర్ఓ కార్యాలయం ఎదురుగా గ్రామ వాల్మీకిల ఐక్యతతో సోమవారం రోజున గ్రామ పెద్దలు మరియు ప్రజల సహకారంతో వేదపండితుల మంత్రోచ్ఛారణతో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆదివారం రోజున శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల రథోత్సవ కార్యక్రమం అనంతరం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సుంకులాపరమేశ్వరి దేవి,వాల్మీకి మహర్షి విగ్రహాలను గ్రామ ప్రధాన రహదారులలో ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ట అనతరం టీడీపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర కుటుంబ సభ్యులు,తుగ్గలి వైసిపి నాయకులు మోహన్ రెడ్డి,నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,హగిరి వెంకటేష్,వెల్ఫేర్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు పులిశేఖర్, తుగ్గలి మాజీ ఎంపీటీసీ వల్లే వెంకటేష్ లు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,గ్రామ పెద్దలు,వాల్మీకి సోదరులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన కాంగ్రెస్ నేత దొంతి గోపి

**కరీంనగర్: పెన్ పవర్:** మారుతి నగర్ 30వ డివిజన్ కు చెందిన ఎన్.శివ వర్ధన్ పందిళ్ళ రాజేందర్ పలు ఆరోగ్య సమస్యల కోసం చికిత్స చేయించుకుని ఆర్థిక సహాయార్థం సీఎం సహాయ నిధిని ఆశ్రయించగా వారికి సీఎం నుండి మంజూరుకాగా, రాష్ట్ర రవాణా %a% బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు 30వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతి గోపి నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలియజేసినారు, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రేవంత్ సర్కార్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని దొంతి గోపి అన్నారు.

## అవార్డు గ్రహీతకు సన్మానం..

**కమాన్ పూర్: పెన్ పవర్:** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షుడు గుర్రం లక్షణాలు దంపతులను బి.ఆర్.ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

లిబిట్.బిట్.డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి నెలలో గోదావరిఖనిలో జరిగిన ఉగాది పురస్కారాలలో భాగంగా వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి అవార్డుల ప్రాధానోత్సం జరిగింది. ఈ అవార్డులో భాగంగా కమాన్ పూర్ గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు కి సేవా రత్నా అవార్డ్ అందుకున్న సందర్భంగా ఆదివారం జూపాక మూర్తి ఆధ్వర్యంలో అవార్డ్ గ్రహీత గుర్రం లక్ష్మిమల్లు ని శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ కన్వీనర్ తాటికొండ శంకర్, బి.ఆర్.ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, నాయకులు నీలం శ్రీనివాస్, జాబు సతీష్, గుర్రం రవి, రాంపెల్లి రవి, తోట రాజ్ కుమార్, సాన సురేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు

# సన్నబియ్యం పంపిణీతో పేదల ఇంట్లో పండగ

**కమాన్ పూర్: పెన్ పవర్:** రామగిరి మండలంలోని సుందిల్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది.

ఇచ్చిన మాట ప్రకారం సన్న బియ్యం పంపిణీ పథకం ప్రవేశపెట్టిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి,పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమర్ రెడ్డికి,ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి కాంగ్రెస్ నాయకులు మరియు మహిళలు,గ్రామస్థులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ....

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేశ చరిత్రలోనే కానీ విని ఎరగని రీతిలో సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కుటుంబాల కోసం తొమ్మిది రకాల నిత్యవసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా అందించడం జరిగిందని వారు గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కీలకమైనటువంటి ప్రధాన పాత్ర పోషించినటువంటి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చైర్మన్గా దుద్దిల్ల శ్రీధర్ బాబు ఉండి ఈ పథకాలను లబ్ధిదారులకు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేసినటువంటి శ్రీధర్ బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రానున్న రోజులలో మేనిఫెస్టోలో పెట్టినటువంటి హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్తున్నారని వారన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలలో 500 గ్యాస్ సిలిండర్,ఉచిత మహిళ బస్సు,ప్రయాణం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ 10 లక్షల వరకు పెంపు,జాబ్ క్యాలెండర్లో శ్రీధర్ బాబు చేసినటువంటి కృషి అమూల్యమైనదని వారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు జనగామ కృష్ణ స్వామి,ఉపాధ్యక్షుడు రేకుంట్ల రవి,అసెంబ్లీ యూత్ ప్రధాన కార్యదర్శి గడ్డం సదానందం, ఎన్ ఎస్ యూ ఐ నాయకుడు ఈగ ప్రశాంత్, కమాన్ పూర్ సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పాపి రెడ్డి,మాజీ ఎంపిటిసి ఉట్ల గోపాల్ రెడ్డి,గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముస్కుల నరేందర్ రెడ్డి,గర్రేపల్లి ప్రవీణ్ గౌడ్,కోరకొప్పుల లక్ష్మణ్ గౌడ్, రేషన్ డీలర్ ఉట్ల రాజీరెడ్డి మరియు గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఏం పి నాయుడు.

**తిరుపతి. పెన్ పవర్:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం లో పాల్గొన్న తిరుపతి రూరల్ మండలం అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ మేడసాని పురుషోత్తమ నాయుడు మరియు కార్యకర్తలు పాల్గొని భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించి 45 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఎక్కడా ఎటువంటి మచ్చ లేకుండా పార్టీ కార్యక్రమాలు అన్ని కూడా చాలా చక్కగా నడిచాయి అని చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ మేడసానీ పురుషోత్తమ నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ మేడసాని పురుషోత్తమ నాయుడు,తిరుపతి రూరల్ మండలం అధ్యక్షుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందనీ కార్యకర్తలు అందరూ పార్టీకి లోబడి పని చేయాల్సి ఉంటుందని భారతీయ జనతా పార్టీ చేసే ప్రతి కార్యక్రమంలోనూ కార్యకర్తలు అందరూ పాలు పంచుకోవాలని సందర్భంగా తెలియజేసారు. బిజెపి ప్రస్థానం రెండు సీట్లు నుంచి ఈరోజు 330 కి పైగా సీట్లతో దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో అధికారంలో ఉందని ఎన్నో ప్రజా రంజక పథకాలతో ప్రపంచంలో ముందుకు దూసుకెళు తోంది విజయ్ కుమార్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో రూపేష్ బాబు ,నాగరాజు శెట్టి, ఎస్ విజయ్ కుమార్, డి వెంకటరమణ, మోహన్, మురళి ఓబీసీ మోర్చా ,లక్ష్మీదేవి, జ్యోతి ,వెంకటరామయ్య, వెంకటేష్, సుధాకర్, ప్రసాద్ , శుభకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైలులో లైగింక వేధింపులు పోలీసుల అదుపులో నిందితుడు

**సికింద్రాబాద్.. పెన్ పవర్:** కదులుతున్న రైల్లో వాష్ రూమ్ వద్ద మైనర్ బాలిక పై లైంగిక వేధింపులకు పాల్పడి వీడియోలు చిత్రీకరించిన వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రిమాండ్ కు తరలించారు.బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్ కుమార్ అనే వ్యక్తి మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి అత్యాచారం చేసి వీడియోలు చిత్రీకరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. బీహార్ కు చెందిన సంతోష్ కుమార్ బతుకుదెరువు కోసం గత రెండేళ్లుగా బేగంపేటలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వాటర్ బాయ్ గా పనిచేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. తన సోదరుడి వివాహం గత నెలలో జరగగా అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక నెల 1న దర్భంగా రైల్వే స్టేషన్ లో రక్సెల్ సికింద్రాబాద్ ఎక్స్ప్రెస్ రైల్లో హైదరాబాద్ నగరానికి బయలుదేరాడు. ఒరిస్సా కు చెందిన ఓ వ్యక్తి తన భార్య పిల్లలతో కలిసి అదే రైల్లో మరసటి రోజు ఎక్కినట్లు పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో వాష్ రూమ్ కు వెళ్లిన మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు గురిచేసిన సంతోష్ కుమార్ వాష్ రూమ్ లోనే ఆమెపైఅత్యాచారం చేసి వీడియో చిత్రీకరించాడు. కాసేపటికి నిందితుడి చెర నుండి బయటకు వచ్చిన బాలిక తనపై జరిగిన అఘాయిత్యాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్ ను పరిశీలించారు. వెంటనే నిందితుడు మరో భోగిలోకి పరారవడంతో టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి బాధితులు ఫిర్యాదు చేయడంతో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫోన్ డేటా ఆధారంగా నిందితుడిని బేగంపేటలో పట్టుకున్న పోలీసులు రిమాండ్ కు తరలించారు. అనంతరం కేసును మహారాష్ట్రలోని ఇత్వారి జిఆర్పికి బదిలీ చేశారు.

## పోలీసుల అదుపులో ఆహ్మద్ బాష

**కడప: పెన్ పవర్:** మాజీ డిప్యూటీ సీఎం అంజద్ భాష సోదరుడు అహ్మద్ భాషా కడప పోలీసుల అదుపులో వున్నట్లు సమాచారం. అహ్మద్ బాషాను కడప పోలీసులు ఆదివారం ముంబై లో అరెస్ట్ చేసారు. సోమవారం ఉదయం భద్రత నడుమ కడపకు తెచ్చారు. నగర శివారులోని పోలీసు శిక్షణ కేంద్రంలో ఆయనను విచారిస్తున్నట్లు సమాచారం

## విశాఖ చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**విశాఖపట్నం: పెన్ పవర్**అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖ విమానాశ్రాయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా డుంబ్రిగూడ మండలం, పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామానికి బయలుదేరారు. గిరిజన గ్రామాల అభివృద్ధి నిమిత్తం చేస్తూనే "అడవి తల్లి బాట" కార్యక్రమానికి పెదపాడు గ్రామంలో అయన శ్రీకారం చుడతారు. అంతకు ముందు విమానాశ్రయంలో విశాఖ జిల్లా కలెక్టర్ శ్రీ ఎం.ఎన్.హరేంద్రప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు, యలమంచిలి శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పోరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావు, ప్రధాన కార్యదర్శి శ్రీ బొలిశెట్టి సత్యనారాయణ, పార్టీ నేతలు డాక్టర్ సందీప్ పంచకర్ల, పసుపులేటి ఉషాకిరణ్, బోడపాటి శివదత్, భీశెట్టి వసంత లక్ష్మి తదితరులు ఘన స్వాగతం పలికారు

# సంక్షేమ పథకాలకు.. నిధులు ఎలా

**హైదరాబాద్, ఏప్రిల్ 7, పెన్ పవర్** రేవంత్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. వాటిల్లో ముఖ్యంగా రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వీటి అమలు కోసం భారీగా నిధులు కావాలి. దీంతో ఆర్థిక శాఖ అధికారులు నిధుల సేకరణపై ఫోకస్ పెట్టారు.తెలంగాణ ప్రభుత్వం రెండు సంక్షేమ పథకాలను ప్రతిష్మాత్మకంగా భావిస్తుంది. వీటి అమలు కోసం మూడు నెలల్లో దాదాపు రూ.15 వేల కోట్లు అవసరం అని తెలుస్తోంది. ఆ నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ వనరులు, రుణాలపై ఆర్థిక శాఖ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని.. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే అమలు చేయనున్నారు.రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా.. ఇప్పుడు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అర్హులను ఎంపిక చేసి.. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్థిక సాయం మంజూరు పత్రాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ పథకానికి రూ.6 వేల కోట్లు ఇస్తామని స్పష్టం చేసింది. జూన్ 2 నాటికి ఈ పథకం కోసం రూ.6 వేల కోట్లు నిధులు కావాలి.ఇక జూన్ నుంచే ఖరీఫ్ పంటల సాగు సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. రైతు భరోసాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు పంటలకు కలిపి.. రూ.18 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. వీటిలో రూ.9 వేల కోట్లను ఖరీఫ్ సాగుకు పెట్టుబడి కింద వ్యవసాయ శాఖకు విడుదల చేయాలి.ఈ రెండు పథకాల అమలు కోసం జూన్ నాటికి రూ.15 వేల కోట్లను ఆర్థిక శాఖ సిద్ధం చేయాల్సి ఉంది. దీంతో అధికారులు నిధుల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇతర శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కూడా మరిన్ని నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల ఒకటిన ప్రారంభం కాగా.. ఈ నెల 8న బాండ్ల విక్రయం ద్వారా రూ.2 వేల కోట్ల నూతన రుణాల సేకరణకు ఆర్థికశాఖ ప్రయత్నాలు చేస్తోంది.మరోవైపు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ఈ ఏడాది ఇంధన శాఖకు బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు కేటాయించింది. వీటి నుంచి విద్యుత్ సంస్థలకు రాబోయే మూడు నెలల్లో రూ.5 వేల కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉంటుంది. యువ వికాసం, రైతుభరోసా, విద్యుత్ రాయితీ నిధులు తప్పనిసరిగా విడుదల చేయాల్సినవే. అందుకే వాటికే ప్రాధాన్యమిస్తూ సమీకరిస్తున్నట్లు ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ భూముల విక్రయాల ద్వారా నిధులు సమీకరించవచ్చని తొలుత భావించారు. కానీ ప్రస్తుతం అది సాధ్యం కాదని తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం ఫోకస్ పెడుతోంది. కొత్త రుణాల సేకరణపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు, పాత రుణాలపై వడ్డీలు, అసలు కిస్తీల చెల్లింపులకే సరిపోతోందని తెలుస్తోంది.ప్రభుత్వం ప్రాధ్యాన్యత ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఇవ్వాల్సిన నిధులను.. ఇతర మార్గాల ద్వారా సమీకరించక తప్పదని అధికారులు చెబుతున్నారు. అమలు చేయాల్సిన తేదీలు దగ్గరపడుతున్న నేపథ్యంలో.. అధికారులు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# కేసీఆర్ పై మరో కేసు..?



**హైదరాబాద్, ఏప్రిల్ 7, పెన్ పవర్** కటీఆర్ కు అత్యంత అనుచరుడు కొణతం దిలీప్ విదేశీ పర్యటనల ఖర్చు.. కొత్త సెక్రటేరియట్ నిర్మాణానికి అదనపు వ్యయం.. ఇలా చెప్పుకుంటూ పోతే బొచ్చెడు. కానీ ఏ ఒక కేసులోనూ కెసిఆర్ ను రేవంత్ రెడ్డి ఇరికించలేదు. ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయలేదు. ఏదో అనుకూల మీడియాలో గట్టి ప్రచారం తప్ప.. ఇంతవరకు ఊదు కాలింది లేదు.. పీరి లేచింది లేదు.. ఇక ఇప్పుడు తాజాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమస్తే తెలంగాణ మీద ఫోకస్ పెట్టింది. గతంలో ఇది లక్ష్మీ రాజానికి చెందింది.అధికారంలోకి వచ్చిన తర్వాత కెసిఆర్ దీనిని ఓన్ చేసుకున్నాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజ్ న్యూస్ అప్పటి టిఆర్ఎస్ గొంతుగా ఉండేది. ఇది తెలంగాణ భవన్ కేంద్రంగానే చాలా రోజులపాటు కార్యకలాపాలు సాగించింది. అధికారంలో ఉన్నన్ని రోజులు నమస్తే తెలంగాణ, టీ న్యూస్, తెలంగాణ టుడే పేపర్లకు విపరీతంగా ప్రభుత్వ ప్రకటనలు వచ్చేవి. గత పది సంవత్సరాలలో ఈ మీడియా సంస్థలకు ప్రభుత్వం 348.43 కోట్లను ప్రకటనల రూపంలో ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఈ విషయాన్ని విజిలెన్స్ అధికారుల బృందం ప్రాథమికంగా గుర్తించింది. దీనికి సంబంధించిన దర్యాప్తుని కూడా మొదలుపెట్టింది. ఇక ఇదే విషయంపై సమాచార శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఓపెన్ గా అయిన విమర్శలు చేశారు.." పత్రికలకు సర్క్యులేషన్.. చానల్స్ కు రేటింగ్ ఆధారంగా టారిఫ్ ఇస్తారు. గులాబీ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న సమయంలో సొంత మీడియా కోట్ చేసిన ధరకు సమాచార అధికారులు ఒకే చెప్పారని" ఇటీవల పొంగులేటి ఆరపించారు.ఇక సమాచార శాఖలో పనిచేస్తున్న విశ్రాంత అధికారులు కూడా టిఆర్ఎస్ సొంత మీడియా గా పేరుపొందిన తెలంగాణ టుడే విషయంలోనూ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపించారు. నిబంధన ప్రకారం ఒక పత్రిక 18 నెలల పాటు నిరంతరాయంగా పబ్లిష్ అవ్వాలి. ఆ తర్వాత ఇంకా గవర్నమెంట్ యాడ్స్ జారీకి ఎం ప్యానల్ లో చోటు దక్కించుకోవాలి. ఆ తర్వాతే దానికి ప్రకటనలు ఇవ్వాలి. కానీ తెలంగాణ టుడే ఏర్పాటైన మూడు నెలలకే ఆ పత్రికకు ప్రకటనలు ఇవ్వాలని ఉత్తరుడు జారీ అయ్యాయని ప్రభుత్వ పెద్దలు చెప్తున్నారు. అయితే ఈ ఉత్తర్వులు ఇచ్చింది ఎవరు? వాటిపై సంతకాలు చేసింది ఎవరు.. సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ పాటించకుండా మౌఖిక ఆదేశాలతోనే కథ మొదలు పెట్టారా.. అనే అంశాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తులోనే ఇంత వ్యవహార సాగితే.. ఇక తవ్వుతుంటే ఎన్ని విషయాలు తెలుస్తాయో చూడాల్సి ఉంది. మరి దీనిపైనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం గట్టిగా దృష్టి సారిస్తుందా.. కెసిఆర్ ను ఫిక్స్ చేస్తుందా.. ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి. ఒకవేళ ఈ కేసు కూడా కోల్డ్ స్టోరేజ్ లోకి వెళ్తే.. ఇకపై కేసీఆర్ పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెట్టిన ఏ కేసు కూడా ముందుకు వెళ్లదనే అనుకోవాలి.

# హైదరాబాద్‌లో బీజేపీ వెర్సస్ ఎంఐఎం.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఎవరికి..?

**హైదరాబాద్, ఏప్రిల్ 7, పెన్ పవర్** హైదరాబాద్‌లో లోకల్‌బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంది. పువ్వు పార్టీ-పతంగి పార్టీ సై అంటే సై అంటున్నాయి. చివరి నిమిషంలో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలోకి దిగింది బీజేపీ.. గెలిచేందుకు తగినంత బలం లేకపోయినా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తామని కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన బీజేపీ నేతలు.. నామినేషన్ల చివరి రోజు అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ నేత గౌతమ్‌రావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. పార్టీ కార్యకర్తగా ఉన్న తనకు ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం దక్కిందని.. ఈ ఎన్నికల్లో తాము ఎలా గెలుస్తామో ముందు ముందు తెలుస్తుందని గౌతమ్ రావు అన్నారు. పార్టీ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారుమరోవైపు గౌతమ్‌రావు ఎంపికపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో అభ్యర్థులే లేరా అని ప్రశ్నించారు. అధిష్ఠానానికి సీనియర్లు, కార్యకర్తలు కనబడలేదా ? అని కామెంట్ చేశారు. అయితే గౌతమ్‌రావు అభ్యర్థిత్వంపై అభ్యంతరం వ్యక్తం చేసిన రాజాసింగ్‌తో మాట్లాడతామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారుమరోవైపు ఈ ఎమ్మెల్సీ ఎన్నికతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫెవికాల్ బంధం బట్టబయలైందని ఆరోపించారు కేంద్రమంత్రి బండి సంజయ్. మొన్న డీలిమిటేషన్‌తో ఏకమైన ఈ రెండు పార్టీలు.. పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశాయన్నారు. లేటెస్ట్‌గా మజ్లిస్‌ను గెలిపించేందుకు ఈ రెండు పార్టీలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇదే నిదర్శనమన్నారు.






**ఎంఐఎం అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్**

ఎంఐఎం తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్ నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎమ్మెల్సీ, కార్పొరేటర్‌గా పనిచేసిన మిర్జా.. మరోసారి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఇక ఈ ఎన్నికల్లో తమ గెలుపు లాంఛనమే అని ఎంఐఎం ధీమా వ్యక్తం చేసింది.

**మొత్తం 112 మందికి ఓటు హక్కు**

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పుకోవడంతో పోటీ ఎంఐఎం, బీజేపీ మధ్యే ఉండబోతోంది. ఈ ఎన్నికల్లో మొత్తం 112 మంది నేతలకు ఓటు హక్కు ఉంది. ఇందులో 81 మంది కార్పొరేటర్లు, 15 మంది ఎమ్మెల్యేలు, 9 మంది ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇక పార్టీలవారీగా బలాబలాలు చూస్తే కాంగ్రెస్‌కు 14, ఎంఐఎంకు 49, బీఆర్ఎస్‌కు 24, బీజేపీకి 25 సభ్యుల బలం ఉంది. ఈ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ ఏప్రిల్ 23న జరగనుంది.

# వేములవాడలో వింత ఆచారం

**కరీంనగర్, ఏప్రిల్ 7,పెన్ పవర్** శ్రీరామనవమి సందర్భంగా అంతట సీతారాముల కల్యాణం జరిగితే వేములవాడలో వింత వివాహాలు జరిగాయి. రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణ శుభముహూర్తాన శివపార్వతులు జోగినిలు (ట్రాన్స్ జెండర్స్) శివుడిని పెళ్లి చేసుకున్నారు. ఓవైపు సీతారాముల కల్యాణం జరుగుతుంటే మరోవైపు స్త్రీ పురుష వయోభేదం లేకుండా వేలాదిగా తరలివచ్చిన శివపార్వతులు జోగినీలు, చేతిలో త్రిశూలం, నెత్తిన జిలకర బెల్లం పెట్టుకుని పెళ్లికూతురులా తయారై దేవుడిని పెళ్లి చేసుకున్నారు. త్రిశూలానికి భాషింగం కట్టి, మెడలో రుద్రాక్ష మాల, పసుపు కొమ్ము వేసుకొని ఒకరిపై మరొకరు అక్షంతలు చల్లుకుంటూ తలంబ్రాలు పోసుకుని దేవుడితో పెళ్లైనట్లు భావించారు. వేములవాడలో శ్రీరామనవమికి ఓ ప్రత్యేకత ఉంటుంది. రాజేరాజేశ్వరస్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణంతో పాటు శివపార్వతులు జోగినిలు, ట్రాన్స్ జెండర్స్ శివుడిని పెళ్లి చేసుకుంటారు. ఒకే వేదికపై రెండు వివాహ సన్నివేశాలు వేములవాడలో కనిపించడం ప్రత్యేకత. ప్రతి ఏటా శ్రీరామనవమికి కన్నుల పండువలా సీతారాముల కల్యాణంతోపాటు శివపార్వతులు శివుడిని పెళ్లి చేసుకోవడం వింత ఆచారం అనాదిగా కొనసాగుతుంది.వింత ఆచారాన్ని రూపుమాపేందుకు శివపార్వతుల కోసం ప్రత్యేకంగా మహాశివరాత్రి తర్వాత శివ కల్యాణం నిర్వహిస్తున్నప్పటికీ ధారణ చేసుకునే శివపార్వతులు మాత్రం శ్రీరామనవమికే వేములవాడకు వచ్చి దేవుడిని పెళ్లి చేసుకోవడం విశేషం. అనేక దశాబ్దాలుగా సాగుతున్న శివపార్వతుల పెళ్లి విశ్వాసంతో మొదలై, ఆచారంగా పరిణమించింది. జీవనశైలిగా ఇక్కడ దర్శనమిస్తోంది. అలవికాని పేదరికం, తీవ్రమైన అనారోగ్యం, ఎదుగు బొదుగులేని జీవితం, నిరాశావహమైన భవిష్యత్తు వారిని దేవుణ్ణి పెళ్లి చేసుకునేలా చేస్తున్నాయి.వేదికపై ఓవైపు దేవతామూర్తులకు కళ్యాణోత్సవం వైభవంగా సాగుతుంటే, ఆ సన్నిధిలోనే జోగినీలు శివుడిని తమ నాధునిగా భావించి ధారణ చేస్తారు. కేవలం ఈ వివాహం కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా చత్తీస్గడ్, మహారాష్ట్ర ల నుండి వేలాదిగా భక్తులు తరలివస్తారు. తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, నిజామాబాద్ ,జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, కొమరం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, జనగామ, వరంగల్, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుండి ఎక్కువగా, ఇతర జిల్లాల నుండి సంఖ్య కాస్త తక్కువగా శివపార్వతులుగా మారిన స్త్రీలు,పురుషులు, పిల్లలు వేములవాడలో జరిగే శ్రీరామ నవమికి తప్పక హాజరవుతారు. సీతారామ చంద్రులకు తలంబ్రాలు సమర్పించే వేళ వేములవాడ రాజన్న సన్నిధిలో శివపార్వతుల వివాహ ఘట్టం తలంబ్రాల వర్షం కురుస్తున్నట్టు మారిపోతుంది.శివపార్వతులు నవమి రోజున శివుడిని తమ భర్తగా భావించి వివాహాన్ని పునరుద్ధరించుకునేందు కోసమే ఇక్కడికి వేల సంఖ్యలో తరలివస్తారు. శివపార్వతుల వివాహ సమయంలో వారి చేతుల్లోని త్రిశూలం గంటలమోతలు, కల్యాణ వేదిక ప్రాంగణమంతా వర్షపు జల్లుగా కురిసే తలంబ్రాలు, శివసత్తుల పూనకాలు అద్భుత దృశ్యాలు కనిపిస్తాయి. రుద్రాక్షలు మంగళసూత్రాలుగా, కాళ్లకు రాగిమట్టెలు, చేతికి త్రిశూలం ఇచ్చి వీరశైవులు వీరి పెళ్లి తంతును పూర్తి చేస్తారు.రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సరే.. నవమి నాటికి జోగినిలు వేములవాడ చేరుకుంటారు. శివుడితో ధారణ పేరుతో తమ పెళ్లిళ్లు పునరుద్ధరించుకుంటారు. ఈ సంఖ్య లక్ష వరకు ఉండడం ఆశ్చర్యకరమైన విషయం. సీతారామ కల్యాణానికి ముందే శివపార్వతులు కొత్త దుస్తులు ధరించి, నుదుట పెద్ద బొట్టుతో, తలపై జీలకర్ర బెల్లం, చేతిలో త్రిశూలం, భుజానికి జోలె, అక్షింతలు పట్టుకొని శివుడితో వివాహానికి సిద్ధమవుతారు. ఇందులో వైవాహిక జీవితం గడుపుతున్న వారు కూడా ఉన్నారు. అనారోగ్య కారణాలు, జీవితంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇతరత్రా సమస్యలు తెలంగాణలో అనేక మందిని శివపార్వతులుగా మార్చడంలో దోహదపడుతున్నాయి. వేములవాడ దేవస్థానంలో శివపార్వతుల పెళ్లి తంతు వీరశైవులు నిర్వహిస్తారు.శివపార్వతులుగా మారేవారికి వీరశైవులు మెడలో రుద్రాక్షను మంగళసూత్రంగా వేస్తారు. కాళ్లకు రాగి మట్టెలు తొడిగి స్త్రీ, పురుష భేదం లేకుండా వారికి చీర కట్టిస్తారు. అనంతరం చేతికి త్రిశూలం ఇచ్చి శివుడితో పెళ్లి జరిపిస్తారు. దీంతో ఆయా స్త్రీ, పురుషులు శివపార్వతులుగా మారినట్టు భావిస్తారు. శివపార్వతులు కనీసం ఐదు ఇళ్లలో, శ్రావణమాసంలో కొన్ని వారాలపాటు భిక్షాటన చేస్తారు. శివుడిని పెళ్లి చేసుకున్న తరువాత శివుడి భార్యగానే కొనసాగుతున్న వారు ఉన్నారు. ఆర్థికంగా, సామాజికంగా మెరుగైన జీవనం గడుపుతున్న వారు, కుటుంబ జీవన వ్యవస్థలో కొనసాగుతున్న వారిలో కొందరు నవమి రోజు వేములవాడ వచ్చి ఈ ధారణ కార్యక్రమంలో పాల్గొంటారు.సీతారాముల కళ్యాణ శుభ ముహూర్తాన శివుడుని వివాహం చేసుకున్నట్లు భావించే శివపార్వతులు సాయంత్రం జరిగే శోభాయాత్ర లో హల్చల్ చేస్తారు. శివపార్వతులు జోగినిలు హిజ్రాలు డిజే సౌండ్స్ తో డప్పు నృత్యాలు చేస్తూ హంగామా సృష్టిస్తారు. రాత్రి పొద్దుపోయే వరకు ఆడి పాడిన శివపార్వతులు మరుసటి రోజు పోచమ్మకు బోనాల సమర్పించి విందు భోజనాలు ఆరగిస్తారు. శివుడిని వివాహం చేసుకున్న శివపార్వతులు రాజన్న సన్నిధిలో మొక్కులు చెల్లించి తిరుగు ప్రయాణం అవుతారు.మహిళలు, పురుషులే కాదు.. లోకజ్ఞానం తెలియని ఆడపిల్లను శివపార్వతులుగా మార్చే శివుడితో పెళ్లి తంతు ప్రక్రియ ధారణ పేరుతో వేములవాడ రాజన్న సన్నిధిలో ఏళ్ల తరబడి సాగిపోతూనే ఉంది. అటు ప్రభుత్వం, ఇటు పోలీసు యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు చిన్నారుల పెళ్ళికి అభ్యంతరాలు చెబుతున్నా, పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చిందే తప్ప.. ఆచారం మాత్రం యధావిధిగా కొనసాగుతూనే ఉంది. దైవభక్తితో సాగుతున్న వింత ఆచారం వికృత రూపం దాల్చకుండా ప్రభుత్వం పకడ్బంధీ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# లీగల్ ఫైట్ కు రెడీ అవుతున్న తెలంగాణ

**హైదరాబాద్, ఏప్రిల్ 7,పెన్ పవర్**ఏపీ సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ సర్కార్ న్యాయపోరాటానికి సిద్ధమైంది. రాయలసీమ ఎత్తిపోతల, బనకచర్ల ప్రాజెక్టులపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది. హైదరాబాద్ లోని జలసౌధలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన రెండు ప్రధాన నదుల అనుసంధాన ప్రాజెక్టులైన గోదావరి-బనకచెర్ల లింక్ స్కీం, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఆర్ఎల్ఐఎస్)పై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది హైదరాబాద్ లోని జలసౌధలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఇటీవలనే ఆమోదం తెలిపింది.సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై న్యాయనిపుణులు, నీటి పారుదల శాఖ స్టాండింగ్ కౌన్సిల్స్, అడ్వకేట్ జనరల్ తో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు 1980 నాటి గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డును, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని (ఏపీఆర్ఏ) నేరుగా ఉల్లంఘిస్తోందన్నారు.రాయలసీమలోని నాలుగు జిల్లాలైన కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరులోని 1.9 మిలియన్ల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2020 ఆగస్టులో వైఎస్ జగన్ సర్కార్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం (ఆర్ఎల్ఐఎస్)ను చేపట్టింది. ఈ పథకాన్ని కూడా సవాలు చేయాలని సమావేశం తెలంగాణ సర్కార్ నిర్ణయించింది.గోదావరి, కృష్ణా నదీ జలాల్లో తమకు రావాల్సిన న్యాయమైన వాటాను కాపాడుకుంటామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ రెండు ఇరిగేషన్ ప్రాజెక్టులు%ా%. నీటి

పంపకాల ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నాయని చెప్పారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి అవసరాలకు తీవ్ర ముప్పుగా మారుతాయని చెప్పుకొచ్చారు.సంబంధిత రెగ్యులేటరీ అథారిటీల అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా ప్రాజెక్టులను చేపడుతోందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండబోదని%ా% అక్రమ నిర్మాణాలు, నీటి మళ్లింపును అడ్డుకునేందుకు సుప్రీంకోర్టులో ఈ అంశాన్ని లేవనెత్తుతామని ప్రకటించారు.రూ.80,112 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టులో గోదావరి నది నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్, బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా 200 టీఎంసీల నీటిని రాయలసీమకు మళ్లించాలని ఏపీ సర్కార్ నిర్ణయించింది. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేయాలని ప్రతిపాదించింది.పోలవరం లింక్ ప్రాజెక్టును 100 శాతం ప్రభుత్వ ఆధీనంలోని జల హారతి కార్పొరేషన్ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.కోట్ల వ్యయంతో చేపట్టిన ఆర్ఎల్ఐఎస్ ప్రాజెక్టు ద్వారా సంగమేశ్వరం సమీపంలోని శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారు. శ్రీశైలం కుడి

ప్రధాన కాలువ (ఎస్ఆర్ఎంసీ)లోకి పంపింగ్ చేసి నాలుగు జిల్లాల్లోని వివిధ సాగునీటి కాలువలకు నీరందించనున్నారు.ప్రాజెక్టుతో తెలంగాణకు తీవ్రస్థాయిలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంటుందని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే%ా% సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించింది. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), అపెక్స్ కౌన్సిల్ నుంచి ఆంధ్రప్రదేశ్ తప్పనిసరిగా అనుమతులు పొందలేదని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వీలు కల్పించే ఏపీ విభజన చట్టంలోని సెక్షన్లు 46(2), 46(3)లను ఉపయోగించుకుని కేంద్ర నిధులను పొందేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తోందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. అయితే ఇలాంటి నిబంధనలు చట్టబద్ధమైన అనుమతులు, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను అధిగమించలేవని హెచ్చరించారు.

## అమరావతిలో మరో అధునాతన నగరం!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. 2015లో శంకుస్థాపన జరిగిన ఈ మహానగరం నిర్మాణం వైసీపీ పాలనలో పడకేసిన విషయం తెలిసిందే. గత ఏడాది అధికారంలోకి వచ్చిన నుంచి అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాలని అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం రోజుకో థీమ్ ను ముందుకు తెస్తోంది. ఇప్పటికే నవనగరాల కాన్సెప్ట్ తో రాజధాని నిర్మాణానికి ప్లాన్ చేయగా, ఇప్పుడు ఏఐ సిటీ, క్వాంటమ్ కంప్యూటరింగ్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక తాజాగా రాజధానిలోనే 50 ఎకరాల్లో సైన్స్ సిటీ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది.రాజధాని అమరావతిలో అత్యాధునిక వసతులతోపాటు, దేశంలో ఎక్కడా లేని వసతులు సమకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానంగా టెక్నాలజీ, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ రంగాల్లో అమరావతిని దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాజధాని పునఃనిర్మాణ పనులతోపాటే కొత్త కొత్త ప్రాజెక్టులను తెరపైకి తెస్తోంది. గతంలో నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం రాజధానిలో నవ నగరాలు ఉంటాయి. ఈ నవ నగరాల్లో దేనికది తీసిపోని విధంగా నిర్మించడంతోపాటు అత్యాధునిక వసతులు కల్పించనున్నారు. అయితే గత ఏడాది నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు అమరావతికి అదనపు హంగులు అద్దాలని డిసైడ్ అయ్యారు. దీనిలో భాగంగా డ్రోన్ సిటీ, ఏఐ సిటీ, క్వాంటమ్ కంప్యూటర్ హబ్ వంటి టెక్నాలజీ రంగాలకు పెద్దపీట వేశారు. ఇక హైదరాబాద్ లోనే గతంలో చంద్రబాబు నిర్మించిన జీనోమ్ వ్యాలీని తలదన్నేలా అమరావతిలో కొత్తగా సైన్స్ సిటీని ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదిస్తున్నారు.సీఎం చంద్రబాబు ఆలోచన ప్రకారం అమరావతిలో సైన్స్ సిటీ ఏర్పాటుకు కేంద్రం కూడా ఓకే చెప్పిందంటున్నారు. సుమారు 50 ఎకరాల్లో నిర్మించనున్న సైన్స్ సిటీకి దాదాపు రూ.200 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సరిగా లేనందున కేంద్రమే ఈ నిధులను భరించేలా సీఎం చంద్రబాబు ఒప్పించారని అమరావతిలో టాక్ నడుస్తోంది. అమరావతిలో నిర్మించనున్నా ఈ సైన్స్ సిటీలో పది మ్యూజియమ్స్, ఇంక్యుబేషన్ సెంటర్లు, గ్లోబల్ రీసెర్చ్ కొలాబరేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా కొత్త పరిశోధనలను ప్రోత్సహించేలా యువత కోసం నైపుణ్యాల పెంపు కేంద్రాలను ప్రారంభించనున్నారు.వాస్తవానికి సైన్స్ సిటీల నిర్మాణానికి అయ్యే వ్యయంలో సగం మాత్రమే కేంద్రం భరిస్తుంది. అయితే నవ్యాంధ్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మొత్తం ఖర్చును కేంద్రమే భరించాలని సీఎం చంద్రబాబు విన్నవించారని అంటున్నారు. దీంతో సీఎం చంద్రబాబు రిక్వెస్టును సానుకూలంగా పరిగణించిన కేంద్రం అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో సైన్స్ సిటీ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. వచ్చే ఐదేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సైన్స్ సిటీ సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా మారనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## హెచ్1బీ, ఎఫ్1, గ్రీన్ కార్డు వీసాదారులకు ట్రంప్ మరో షాక్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో వలసదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. హెచ్1బీ, ఎఫ్1 వీసాలు కలిగినవారు , గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సహాయం అందిస్తున్న కీలకమైన కార్యాలయాన్ని ఆయన ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేయడంతో ఇకపై ఈ వర్గాల వారికి సహాయం లభించదు.ట్రంప్ ప్రభుత్వం సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (సీఐఎస్) అంబుడ్స్‌మన్ కార్యాలయ సిబ్బందిని 60 రోజుల పరిపాలనా సెలవుపై పంపింది. ఇది స్వతంత్ర ఇమ్మిగ్రేషన్ పర్యవేక్షణ సంస్థను రద్దు చేసే దిశగా తొలి అడుగు అని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యల ప్రభావం ఆఫీస్ ఫర్ సివిల్ రైట్స్ అండ్ సివిల్ లిబర్టీస్, ఆఫీస్ ఆఫ్ ది ఇమ్మిగ్రేషన్ డిటెన్షన్ అంబుడ్స్‌మన్‌పై కూడా పడింది. దీంతో సీఐఎస్ కార్యకలాపాలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది.ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వీసా , గ్రీన్ కార్డ్ కార్యకలాపాలను క్రమబద్ధీకరించే ప్రయత్నంగా సమర్థించుకుంటున్నప్పటికీ, అంబుడ్స్‌మన్ ప్రమేయం లేకుండా వలస కేసులను ఎలా పరిష్కరిస్తారో స్పష్టంగా చెప్పడం లేదు. ఈ పరిణామం సహజంగానే అమెరికాలో ఉన్న భారతీయ హెచ్1బీ, ఎఫ్1 వీసాదారులు , గ్రీన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వారిపై తీవ్ర ప్రభావం చూపనుంది. గతంలో ఈ హెల్ప్ డెస్క్ ఏటా సుమారు 30 వేల మందికి వీసా ప్రాసెసింగ్ ఆలస్యం , ఇతర సమస్యల పరిష్కారంలో సహాయం చేసింది.ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ప్రభావితమయ్యే వారు తమ ఆలస్యమైన లేదా వివాదాస్పదమైన యూఎస్‌సీఐఎస్ కేసుల సహాయం కోసం కాంగ్రెస్ ప్రతినిధిని సంప్రదించాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. అలాగే వృత్తిపరమైన మార్గదర్శకత్వం కోసం ఇమ్మిగ్రేషన్ న్యాయవాదులను సంప్రదించాలని కోరుతున్నారు. తమ వద్ద అన్ని రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని , వీసాలు, గ్రీన్ కార్డుల కోసం ప్రీమియం ప్రాసెసింగ్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నేపథ్యంలో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి పెద్ద సంస్థలు తమ హెచ్1బీ ఉద్యోగులను ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణాలు మానుకోవాలని సూచిస్తున్నాయి. ఈ పరిణామం అమెరికాలో ఉన్న వలసదారుల్లో మరింత ఆందోళన కలిగిస్తోంది.

# మనిషికి మించిన తెలివి..2030లో ఏఐదే రాజ్యం!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ టెక్నాలజీ రంగంలో తన విప్లవాత్మక ఆవిష్కరణలతో ముందంజలో ఉన్న గూగుల్ సంస్థకు చెందిన కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - AI) పరిశోధనా విభాగం డీప్‌మైండ్ తాజాగా ఒక దిగ్భ్రాంతికరమైన అంచనాతో కూడిన సమగ్ర పరిశోధనా పత్రాన్ని విడుదల చేసింది. 145 పేజీల ఈ నివేదిక ప్రకారం, రానున్న కొద్ది సంవత్సరాల్లోనే, అంటే 2030 నాటికి ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (AGI) మానవుల మేధో సామర్థ్యాలను సైతం అధిగమించగల శక్తిని చేరుకోనుంది. అయితే, ఈ అసాధారణమైన సాంకేతిక పురోగతి మానవజాతి మనుగడకు ఒక శాశ్వతమైన ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని, ఒకవేళ దీని అభివృద్ధిని సరైన నియంత్రణలో ఉంచకపోతే ఊహించని పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని గూగుల్ డీప్‌మైండ్ తీవ్రంగా హెచ్చరించింది.ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (AGI) అనేది AIఒక సైద్ధాంతిక రూపం. ఇది మానవుల మాదిరిగానే సాధారణ ప్రజ్ఞను కలిగి ఉంటుంది. దీని అర్థం, మనుషులు తమ మేధస్సుతో చేయగలిగే ఏదైనా పనిని AGI విజయవంతంగా నేర్చుకోగలదు లేదా పూర్తిగా అర్థం చేసుకోగలదు. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న చాలా AI వ్యవస్థలు ప్రత్యేకమైన పనులను మాత్రమే నిర్వహించగలవు. ఉదాహరణకు, ఒక చిత్రాన్ని గుర్తించడం, ఒక భాషను మరొక భాషలోకి అనువదించడం లేదా ఒక నిర్దిష్ట ఆటను ఆడటం వంటివి మాత్రమే వాటి పరిధిలో ఉంటాయి. కానీ ఒకసారి AI అభివృద్ధి చెందితే, అది జ్ఞానాన్ని సంపాదించడం, తార్కికంగా ఆలోచించడం, సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో మానవులతో పోటీ పడగలదు లేదా వారిని మించిపోగలదు.గూగుల్ డీప్‌మైండ్ ఈ భవిష్యత్ అంచనా ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్నాలజీ నిపుణులు, పరిశోధకులలో తీవ్రమైన చర్చకు దారితీసింది. కొందరు నిపుణులు AI మానవాళికి వైద్యం, విద్య, శాస్త్ర పరిశోధన వంటి అనేక రంగాలలో ఊహించని ప్రయోజనాలను చేకూర్చగలదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే, మరికొందరు దాని ప్రమాదాల గురించి తీవ్రమైన ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నివేదిక ప్రత్యేకంగాAI అపారమైన శక్తిని దుర్వినియోగం చేస్తే సంభవించే వినాశకరమైన పరిణామాల గురించి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఒకవేళ ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ మానవ నియంత్రణ నుండి తప్పించుకుంటే, అది స్వతంత్రంగా, అనూహ్యంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని, ఇది చివరికి మానవజాతి మనుగడకే పెను ప్రమాదం కలిగించవచ్చని నిపుణులు గట్టిగా నమ్ముతున్నారు.

# అర్ధరాత్రి యువతిపై లైంగిక వేధింపులు.. దుమారం రేపిన హెూంమంత్రి కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు తీసుకువచ్చినా మహిళలపై జరుగుతున్న వేధింపులు ఆగడం లేదు. కామాంధులు ఆడవారు కనిపిస్తే చాలు హీనంగా ప్రవర్తిస్తూ తమ వక్రబుద్ధిని చాటుకుంటున్నారు. నిర్భయ, పోక్సో వంటి కఠిన చట్టాలు ఉన్నప్పటికీ ఇలాంటి నీచులు తమ ప్రవర్తన మార్చుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.తాజాగా బెంగళూరులోని సుద్దగుంటెపాల్య ప్రాంతంలో జరిగిన ఒక దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇద్దరు యువతులు రాత్రి సమయంలో ఒక వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన ఒక ఆగంతకుడు వారిలో ఒక అమ్మాయిని పక్కకు లాగి ఆమె ప్రైవేటు భాగాలను తాకి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఊహించని సంఘటనతో ఆ యువతులు భయంతో వణికిపోయారు. వెంటనే వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు కావడంతో పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అయితే ఈ ఘటనపై కర్ణాటక హెూంమంత్రి పరమేశ్వర చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. పెద్ద నగరాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మహిళలే కాస్త జాగ్రత్తగా ఉండాలన్నట్లుగా ఆయన మాట్లాడటం వివాదాస్పదంగా మారింది. అయితే పోలీసులు మాత్రం ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు, పెట్రోలింగ్ పెంచాలని, ఆకతాయిలపై కేసులు నమోదు చేయాలని కూడా చెప్పినట్లు తెలిపారు.హెూంమంత్రి పరమేశ్వర చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. ఒక హెూంమంత్రి అయి ఉండి ఇంత బాధ్యతారాహిత్యంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నిస్తున్నారు. మహిళల భద్రతకు పెద్దపీట వేయాల్సిన హెూంమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే హెూంమంత్రి పరమేశ్వర మహిళలందరికీ క్షమాపణ చెప్పాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులను సమర్థించేలా లేదా వాటిని తేలికగా తీసుకునేలా మాట్లాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. హెూంమంత్రి వంటి బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మహిళల భద్రతకు భరోసా కల్పించేలా మాట్లాడాలే తప్ప ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై హెూంమంత్రి ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చిన నటి దియా మీర్జా



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో అటవీ నిర్మూలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రముఖులు స్పందించారు. సినీ, రాజకీయ ప్రముఖులు సైతం తమ సోషల్ మీడియాలో దీన్ని తప్పుపట్టారు. ఈ క్రమంలోనే బాలీవుడ్ హీరో, హీరోయిన్లు సైతం సోషల్ మీడియాలో షేర్ చేశారు. HCU లో విద్యార్థులు చేస్తున్న నిరసనకు మద్దతుగా హీరోయిన్ దియా మీర్జా AI తో రూపొందించిన చిత్రాలు , వీడియోలను ఉపయోగించారనే వాదనలు వినిపించాయి. అయితే నటి , పర్యావరణవేత్త అయిన దియా మీర్జా తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. ఆ ఆరోపణలను ఖండించారు.

**దియా మీర్జా గట్టిగా సమాధానం**

దియా మీర్జా తాజాగా X లో స్పందిస్తూ తాను AI తో రూపొందించిన చిత్రాలను పోస్ట్ చేశాననే ఆరోపణలను ఖండించారు. ఇలాంటి ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను ధృవీకరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. "నిన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఒక ట్వీట్ చేశారు. గచ్చిబౌలి పరిస్థితి గురించి ఆయన కొన్ని వాదనలు చేశారు" అని ఆమె తన ట్వీట్‌లో పేర్కొన్నారు. "వాటిలో ఒకటి ఏమిటంటే, ప్రభుత్వం వేలం వేయాలనుకుంటున్న 400 ఎకరాల భూమిపై జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి విద్యార్థులు చేస్తున్న నిరసనకు మద్దతుగా నేను నకిలీ AIతో రూపొందించిన చిత్రాలు/వీడియోలను ఉపయోగించాననడం పూర్తిగా అవాస్తవమైన ప్రకటన. నేను ఒక్క AI తో రూపొందించిన చిత్రం లేదా వీడియోను కూడా పోస్ట్ చేయలేదు. మీడియా , తెలంగాణ ప్రభుత్వం ఇలాంటి ఆరోపణలు చేసే ముందు వారి వాస్తవాలను ధృవీకరించుకోవాలి." అని అన్నారు.

హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సరిహద్దులో ఉన్న 400 ఎకరాల భూమిని అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికను వ్యతిరేకిస్తూ పలువురు విద్యార్థులు నిరసన తెలిపారు. పట్టణ మౌలిక సదుపాయాలు మరియు ఐటీ పార్కు నిర్మాణం కోసం పర్యావరణపరంగా సున్నితమైన ఈ భూమిని వేలం వేయాలనే తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికను విద్యార్థి సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయం ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు , సుప్రీంకోర్టు రెండింటిలోనూ విచారణలో ఉంది.

ఈ వార్త వెలుగులోకి వచ్చినప్పటి నుండి, పలువురు ప్రముఖులు ఈ ప్రాంతంలో చెట్ల నరికివేతపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

**తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనలు ఏమిటి?**

శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి అధికారులను ఆదేశిస్తూ గచ్చిబౌలి భూమి సమస్యపై కొందరు ఏఐతో రూపొందించిన వీడియోలు, ఫొటోలు షేర్ చేసి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేశారని.. సమాజాన్ని తప్పుదోవ పట్టించిన నెమళ్లు , జింకలను చూపిస్తున్న కృత్రిమ మేధస్సు (AIద్వారా రూపొందించిన కంటెంట్‌పై దర్యాప్తు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున కోర్టును ఆశ్రయించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి. సీతక్క, ముఖ్య కార్యదర్శి ఎ. శాంతి కుమారి, డిజిపి జితేందర్ , ఇతర అధికారులతో కలిసి ఈ విషయం లో సంబంధిత కోర్టు కేసులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ భూమి సమస్య వివాదాస్పదంగా మారడానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో పలువురు ప్రముఖులు AI-తో రూపొందించిన వీడియోలకు బలైపోయారని.. వాటితో సోషల్ మీడియాలో స్పందించారని, దీని ఫలితంగా ఈ విషయం దాదాపు జాతీయ సమస్యగా మారిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు.

# అమరావతి సప్న సాకారం.. 'తొలి' అడుగు పడింది!

**హైదరాబాద్ పెన్ పవర్:** "ఏపీ రాజధాని అమరావతి.. ప్రతి ఒక్కరి కల. ఈ మాట ఎవరో అనలేదు. గత ఏడాది ప్రజలే తమ ఓటు ద్వారా తీర్పు చెప్పారు." అని సీఎం చంద్రబాబు గతంలో చెప్పినట్టు.. ఈ కల సాకారం అయ్యేందుకు.. చంద్రబాబు చేసిన కృషి ఫలించింది. %-%తొలి%-% అడుగు పడింది. ఎప్పుడెప్పుడా అని చంద్రబాబు.. మంత్రులు.. యావత్ రాష్ట్రం కూడా.. కళ్లు కాయలు చేసుకుని మరీ ఎదురు చూసిన అమరావతికి నిధులు వచ్చాయి.

ఒకే సారి సోమవారం కేపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సీఆర్ డీఏ) ఖాతాలోకి 4 వేల కోట్లకు పైగా సొమ్ములు వచ్చి చేరాయి. ఈ మేరకు కేంద్రం నుంచి వెంటనే ఫ్యాక్స్ రూపంలో ప్రభుత్వానికి సమాచారం కూడా చేరింది. దీంతో రాజధాని పనులు.. ఈ నెలలోనే ప్రారంభం కానున్నాయి. కాంట్రాక్టర్లను ఇప్పటికే ప్రభుత్వం ఎంపిక చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నాడు నేడు అంటూ.. నిధుల రాక కొంత సమయం పట్టింది. ఇటీవల ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు మరోసారి ఈ విషయంపై చర్చించారు.ఈ క్రమంలో తాజాగా ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి 3535 కోట్ల రూపాయలు రాష్ట్ర ఖాతాలోకి వచ్చాయి. వీటికితోడు.. కేంద్ర ప్రభుత్వం కూడా.. ప్రస్తుత సంవత్సరంలో 1500 కోట్లను గ్రాంటు గా రాజధానికి ఇస్తామని.. బడ్జెట్‌లోనే ప్రకటన చేసింది. వాస్తవానికి ఈ నిధులు పనులు మొదలయ్యాక ఇస్తామని .. అదే సమయంలో ప్రకటించింది. కానీ.. చంద్రబాబు ఈ విషయంలో పునరాలోచించాలని ప్రభుత్వానికి విన్నవించారు.ఈ క్రమంలో కేంద్రం ఇస్తామని చెప్పిన 1500 కోట్ల రూపాయలలో రెండు భాగాలుగా చేసి.. తొలి భాగం రూ.750 కోట్లను తాజాగా విడుదల చేసింది. దీంతో మొత్తం 3535ం750 కోట్లు కలిపి.. 4285 కోట్ల రూపాయలు కేంద్రం నుంచి రాష్ట్రానికి చేరాయి. దీంతో అమరావతికి రావాల్సిన రుణ సహాయంలో తొలి అంకం పూర్తయింది. ఈ నిధులను



వినియోగించి చేపట్టే పనులకు సంబంధించి వివరాలు ఇచ్చాక..మరిన్ని నిధులను విడుదల చేయనున్నారు.

# కమలదళంలో కోల్డ్ వార్

**హైదరాబాద్, ఏప్రిల్ 7, పెన్ పవర్:** "రాజాసింగ్‌కు ఎవరూ సాటిలేరు.. ఆయన హిందూ ధర్మానికి ఆదర్శం. సర్వం హిందూ ధర్మం కావాలన్నదే రాజాసింగ్ లక్ష్యం". ఈ మాటలు అన్నది మరెవరో కాదు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. సడెన్‌గా బండి అంతలా రాజాసింగ్‌ను ఎందుకు పొగడాల్సి వచ్చింది? హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ముందు.. శ్రీరామనవమి శోభాయాత్రకు ముందు.. రాజాసింగ్‌ను బండి సంజయ్ ఎందుకు ఆకాశానికి ఎత్తారు? ఏదైనా వ్యూహం దాగుందా? మరెవరిపైనైనా మైండ్ గేమ్ ఆడారా? అనే చర్చ నడుస్తోంది. ఈమధ్య గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రెచ్చిపోతున్నారు. కిషన్‌రెడ్డి టార్గెట్‌గా తూటాల్లాంటి మాటలు వదులుతున్నారు. బీజేపీ పెద్ద లీడర్ ఓ మేకప్‌మేన్ అని.. అతని టేబుల్ సాఫ్ చేసే వాళ్లకే పదవులు ఇస్తున్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. గౌతమ్‌రావును ఎమ్మెల్సీ కేండిడేట్‌గా ఎంపిక చేయడంపై రాజాసింగ్ కస్సుమన్నారు. అన్నిపదవులు మీవాళ్లకేనా? బీజేపీలో సీనియర్లు, కార్యకర్తలు లేరా? అంటూ కిషన్‌రెడ్డిపై డైరెక్ట్ అటాక్ చేశారు. ఇక, స్టేట్ బీజేపీ అధ్యక్షుడి ఎంపికపైనా తరుచూ కాంట్రవర్సీ కామెంట్స్ చేస్తుంటారు. ముఖ్యమంత్రులతో బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసే వారికి కాకుండా.. నిఖార్సైన కాషాయ లీడర్లకు, ప్రజల కోసం పోరాటం చేసే వారికే ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వాలంటూ రచ్చ రాజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తనపై పీడీ యాక్ట్ పెట్టి జైల్లో పెట్టడం వెనుకా.. తమ పార్టీ పెద్దలే ఉన్నారని కూడా కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. ఇలా రెగ్యులర్‌గా కమలం పార్టీలో కలకలం రేపే రాజాసింగ్‌కు బండి సంజయ్ లాంటి బిగ్ లీడర్ సరిలేరు నీకెవ్వరూ అనే రేంజ్‌లో కితాబు ఇవ్వడం బీజేపీలో ఆసక్తిగా మారింది.

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం పాతబస్తీలో వేలాదిమందితో భారీ శోభయాత్ర చేపట్టారు రాజాసింగ్. ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చినా ఇవ్వకున్నా.. శోభయాత్ర విషయంలో తగ్గేదేలే అని తేల్చి చెప్పారు. శాంతిభద్రతల సమస్యంటూ పోలీసులు టెన్షన్ పడుతున్నారు. పార్టీ తరఫున రాజాసింగ్‌కు ఎలాంటి సపోర్ట్ లేకున్నా.. ఆయన తన సొంత ఇమేజ్‌తో పాతబస్తీలో మజ్లిస్ పార్టీ ముందు తొడగొట్టాలని చూస్తున్నారు. జై శ్రీరాం.. జై బీజేపీ.. జై యోగి.. జై మోదీ నినాదంతో రాజాసింగ్ ఓల్డ్ సిటీ హీరోగా నిలుస్తున్నారు. ఆయనలోని కరుడుగట్టిన హిందుత్వ భావాజాలం వల్లే.. రాజాసింగ్‌ను పార్టీ అధిష్టానం సైతం ఏమీ అనలేక పోతోంది. లేదంటేనా.. కిషన్‌రెడ్డి ఎప్పుడో తొక్కేసేవారని పార్టీ వర్గాలే అంటున్నాయి. గతంలో ముస్లింలపై ఓ కాంట్రవర్సీ కామెంట్ చేయగా.. ఆయన్ను పార్టీ నుంచి కొన్ని నెలలు సస్పెండ్ చేశారు. ఎన్నికల ముందు మళ్లీ కాషాయ టికెట్ ఇచ్చి.. పాతబస్తీలో బీజేపీకి రాజాసింగ్ మినహా మరెవరూ దిక్కులేరని చెప్పకనే చెప్పారు. అలా సోలోగా ఎదిగి.. బండి సంజయ్‌తో సో బెటర్ లీడర్ అనిపించుకునే స్థాయికి చేరారు రాజాసింగ్. బండి సంజయ్ కావాలనే రాజాసింగ్‌ను ప్రమోట్ చేస్తున్నారా? అనే డౌట్ కూడా లేకపోలేదు. తెలంగాణ బీజేపీలో తీవ్ర వర్గపోరు నడుస్తోందనేది ఓపెన్ సీక్రెట్. కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు లాంటి వాళ్లు ఓ టీమ్ అంటారు. బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, రాజాసింగ్ తదితరులు మరో వర్గంగా ముద్ర పడ్డారు. బండి సంజయ్ తరఫున రాజాసింగ్ గట్టిగా మాట్లాడుతుంటారు. అసలే ఫైర్ బ్రాండ్ లీడర్ కావడంతో ఆయన నోటికి కంట్రోల్ ఉండదు. కిషన్‌రెడ్డి మెతక లీడర్ అని.. ఆయన అధ్యక్షుడిగా ఉంటే తెలంగాణలో బీజేపీ బలపడే ఛాన్సే లేదని గతంలోనే రాజాసింగ్ రచ్చ చేశారు. తాజాగా, అధ్యక్ష మార్పు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రాజాసింగ్ మళ్లీ యాక్టివ్ అయ్యారు. బండి సంజయ్‌కు అనుకూలంగా స్టేట్‌మెంట్స్ పాస్ చేస్తున్నారు. అటు, కిషన్‌రెడ్డి మాత్రం ఈటల రాజేందర్‌కు కిరీటం కట్టబెట్టాలని గట్టిగా ట్రై చేస్తున్నారట. ఇలాంటి సందర్భంలో కిషన్‌రెడ్డిని రాజాసింగ్ కార్నర్ చేస్తుండటం.. రాజాసింగ్‌కు ఎవరూ సాటిలేరు అంటూ బండి సంజయ్ అతన్ని పొగుడుతుండటంతో.. కాషాయ దళంలో కలకలం నెలకొంది.



# సిటలో ఆగని డ్రగ్స్ దందా



**హైదరాబాద్, ఏప్రిల్ 7, పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో డ్రగ్స్‌కు ఏమాత్రం అడ్డుకట్ట పడడంలేదు. దాంతో.. డ్రగ్స్ చైన్ లింకులకు బ్రేకులు వేసే పనిలో పడ్డారు తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు, పోలీసులు.. డ్రగ్స్ సప్లయ్ చైన్‌లో నైజీరియన్లు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించి.. వారికి చెక్ పెట్టారు. డ్రగ్స్ విక్రయం ద్వారా వచ్చిన డబ్బును విదేశాలకు హవాలా మార్గంలో పంపిస్తున్న గ్యాంగ్కు చెందిన ముగ్గురు నైజీరియన్లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.12.5 లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు.. ఈ ముఠాపై గత మూడు నెలలకుపైగా నిఘా పెట్టినట్లు వెల్లడించారు. డ్రగ్స్ తీసుకున్నాక చెల్లింపులు జరుపుతున్నట్లు గుర్తించామని, వీటిని డెలివరీ చేసేందుకు అమ్మాయిలను ఉపయోగిస్తున్నట్లు దర్యాప్తులో తెలిసిందన్నారు. టోలీచౌకి ప్రాంతంలో డ్రగ్స్ డెలివరీ చేసిన యువతిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా.. సంచలన విషయాలు వెలుగు చూశాయన్నారు.. డ్రగ్స్ ముఠా సభ్యులు ఆ యువతికి రూ.50,000 ఇచ్చినట్లు వెల్లడించారు. వారితోనే డైరక్ట్ డీల్ చేసి.. డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్నారు. ఈ డ్రగ్స్ మొత్తం విదేశాల్లోనే తయారు అవుతున్నాయన్నారు. గత 5 సంవత్సరాలుగా డ్రగ్స్ ద్వారా నైజీరియాకు వెళ్లిన డబ్బుల వివరాలు సేకరించామని, భారత్‌తో పాటు అమెరికాలోనూ నైజీరియన్లు డ్రగ్స్ సప్లై చేస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ కావాలని కస్టమర్లు డబ్బులు చెల్లించే లావాదేవీల ద్వారా నిందితులను పట్టుకున్నామన్నారు. కస్టమర్లు డబ్బులు చెల్లించేందుకు 15 మంది యువతుల బ్యాంక్ ఖాతాలు ఇచ్చారని, అమెరికా యువతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు గుర్తించామని శాండిల్య తెలిపారు. 5 సంవత్సరాల్లో డ్రగ్స్ కోసం భారత్, అమెరికా, నైజీరియన్ల మధ్య కోట్ల రూపాయలు లావాదేవీలు జరిగినట్లు తెలిపారు. అమెరికా నుంచి డబ్బులు నేరుగా నైజీరియాకు వెళ్లకుండా మొదట భారత్‌కు పంపిస్తారని, ఇక్కడి నుంచి హవాలా మార్గంలో నైజీరియాకు తీసుకెళ్తారని తెలిపారు. డ్రగ్స్ మొత్తం విదేశాల్లోనే తయారు అవుతున్నాయని, మన దేశంలో చాలా తక్కువ తయారవుతున్నట్లు సందీప్ శాండిల్య వివరించారు దేశంలోనే తొలిసారి డ్రగ్స్ విక్రయాలు, డబ్బుల పంపిణీపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ రూపేష్ తెలిపారు. ఇండియాతో పాటు అమెరికాలోనూ నైజీరియన్లు డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నారన్నారు. అయితే.. అమెరికా అధికారులకు చిక్కకుండా భారత్‌లోని అకౌంట్లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని వెల్లడించారు. హవాలా మార్గంలో డబ్బులు ఇండియాకు డబ్బులు పంపి.. ఇక్కడి నుంచి నైజీరియాకి పేమెంట్లు చేస్తున్నట్లు గుర్తించామన్నారు

# అదిలాబాద్ ఎయిర్ పోర్టు అడుగులు

**అదిలాబాద్, ఏప్రిల్ 7, పెన్ పవర్:** విమానాశ్రయం ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ వాసుల కలలు త్వరలోనే ఫలించబోతున్నాయి. ఆదిలాబాద్?లోని రక్షణశాఖకు సంబంధించిన వైమానిక విమానాశ్రయంలో.. పౌరవిమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని, దీంతో పాటు.. పౌర విమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు ఆయన క్లారిటీ ఇచ్చారు. స్థానిక ప్రజలు, పలు పార్టీల నాయకుల నుంచి కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 29 జనవరి, 2025 నాడు లేఖ రాశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. వ్యక్తిగతంగా కలిసి ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూములను ప్రజావసరాలకు సద్వినియోగం చేసేలా చొరవ తీసుకోవాలని కోరామని అన్నారు. దీనిపై వారు రక్షణ శాఖ అధికారులతో చర్చించిన తర్వాత సానుకూల నిర్ణయాన్ని తెలియజేస్తూ నిన్న లేఖ రాశారని చెప్పుకొచ్చారు. రాజ్‌నాథ్ సింగ్ సానుకూల స్పందనను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందుకుగానూ ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నామని చెప్పారు. 'పత్తి వ్యాపారానికి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు ఆదిలాబాద్ ప్రధానమైన కేంద్రంగా ఉంది. దీంతో ఆదిలాబాద్ తో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల నుంచి.. విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసే విషయంలో చొరవ తీసుకోవాలని దశాబ్దాలుగా డిమాండ్ వినిపిస్తోంది. దీనిపై నేను 7 జూలై 2022, 15 ఫిబ్రవరి 2023నాడు నాటి ముఖ్యమంత్రికి లేఖలు రాశాం. ఐదేళ్లుగా ఈ విషయంపై పదే పదే నేను ప్రస్తావించాను.

అయినా రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'అటు, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే విమానయాన సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభిస్తామని 2021 అక్టోబర్ లో నాటి పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా నాటి సీఎంకి లేఖ రాశారు. కానీ దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. కానీ ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. వారి నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని.. నేను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో, పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడుకి లేఖలు రాయడంతో పాటుగా వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేశాను' అని చెప్పారు.

వరంగల్ విమానాశ్రయానికి అనుమతులు లభించడంతో.. విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేసి ఇస్తే.. ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు కూడా వేగవంతం చేసేందుకు వీలవుతుంది. తద్వారా వీలైనంత త్వరగానే.. వరంగల్ ప్రజల స్వప్నం సాకారం కానుంది. గత నెలలో.. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటు, ఇందుకు సంబంధించిన పురోగతి తదితర విషయాలను నేను, రామ్మోహన్ నాయుడు సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించాం' అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. రీజనల్ కనెక్టివిటీ స్కీమ్ %-% ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ పథకంలో భాగంగా.. దాదాపు 620 రూట్లలో ఇప్పటికే హైదరాబాద్‌కు 60 రూట్స్ (10%) ఆపరేషన్‌లో ఉన్నాయి. వరంగల్, ఆదిలాబాద్‌లో కూడా విమానాశ్రయాల సేవలు ప్రారంభిస్తే తెలంగాణకు ఉడాన్ కింద మరికొన్ని రూట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇది ప్రజల ప్రయాణంతో పాటుగా.. ఈ ప్రాంతంలో వాణిజ్యాభివృద్ధికి కూడా తోడ్పడనుంది' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లో గతంలోనే విమానాశ్రయం ఉండేది. దీన్ని సైనిక అవసరాల కోసం మాత్రమే వినియోగించేవారు. కాలక్రమేణా.. వివిధ కారణాలతో రక్షణ శాఖ కార్యకలాపాలు కూడా ఆగిపోయాయి. ఇప్పుడు ఈ విమానాశ్రయాన్ని తిరిగి యాక్టివేట్ చేయడం రక్షణశాఖకు, పౌర సేవలకు ఎంతో ఉపయోగపడనుంది. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి పట్ల నరేంద్రమోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం. విమానాశ్రయాల ఏర్పాటు వల్ల మన వ్యవసాయ ఉత్పత్తులు.. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునేందుకు మార్గం సుగమం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఆయా విమానాశ్రయాల ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించడంతో పాటుగా సంపూర్ణ సహకారం అందిస్తే.. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు వీలైనంత త్వరగా ప్రజలకు సేవలందిస్తాయి' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## జగన్ నమ్మకం కలిగించలేకపోతున్నారా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏ రాజకీయ పార్టీకైనా కూడా అధినాయకులే ప్రాణ వాయువుగా ఉంటారు. గతంలో అయితే పార్టీ సిద్ధాంతాల మీద పార్టీలు నడిచేవి. ఆ తరువాత కాలం నుంచి నాయకుల ఆకర్షణే పార్టీకి పెట్టుబడిగా మారుతోంది. మరీ ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలలో ఇదే రకమైన తీరు ఉంది. గెలిస్తే అధినాయకుడిని చూపించే గెలవాలి. ఓడినా అలాగే జరుగుతుంది. ఏపీలో చూస్తే పార్టీలు అనే కంటే వ్యక్తుల మీదనే రాజకీయం సాగుతోంది. చంద్రబాబు కావాలా జగన్ కావాలా అన్న దాని మీదనే ఎన్నికలు జరుగుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే వైసీపీలో జగన్ అత్యంత ఆకర్షణ కలిగిన నాయకుడు. ఆయనను చూసే జనాలు ఓట్లు వేస్తారు. ఆ సంగతి తెలిసిందే. అయితే 2014లో లేని సమస్యలు వైసీపీకి 2024లో రావడం జరుగుతోంది. ఆనాడూ పార్టీ ఓటమి పాలు అయింది. కానీ అప్పుడు నూటికి తొంబై శాతం పైగా నాయకులు పార్టీని వెన్నంటి ఉన్నారు. కానీ ఇపుడు చూస్తే అలా కాదు అత్యధికులు పార్టీ గేటు దాటేస్తున్నారు. ఇలా ఎందువల్ల అంటే దానికి కారణాలు ఎవరికి వారుగా చెప్పుకున్నా వైసీపీ ఎన్నడూ లేనంతగా ఘోరంగా ఓటమి పాలు కావడం అన్నది కళ్ళ ముందు ఉంది. గడచిన పది నెలల కాలంలో పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలు అయితే తీసుకోలేదు అని అంటున్నారు. ఇక జగన్ జనంలోకి రాకపోవడం కూడా అతి పెద్ద మైనస్ గా మారుతోంది. జగన్ గతంలో అంటే 2014లో అయితే ఓటమి వెంటనే ప్రజలలోకి వచ్చేశారు. పర్యటనలు చేస్తూ అటు నాయకులకూ ఇటు క్యాడర్ కి హుషార్ తెచ్చేవారు. కానీ ఈసారి మాత్రం అలా జరగడం లేదు. ఆయన ఏ వ్యూహం ప్రకారం అలా చేస్తున్నారో తెలియడం లేదు కానీ పార్టీ చూస్తే స్తబ్దుగా ఉంది. దాంతో ఈ పార్టీలో ఉండలేక నేతలు ఎవరికి వారు జారుకుంటున్నారు. వైసీపీకి జనాదరణ లేదు అన్న ఆలోచనతో కూడా కొందరు చేస్తున్నారు. జగన్ ఈ విధంగానే ఉంటారని ఆయన బయటకు రారు అని భావించి కూడా మరికొందరు చేస్తున్నట్లుగా ఉంది.

ఇక క్యాడర్ లీడర్ ఉత్సాహం లేకపోగా ఎందుకొచ్చిన ఇబ్బంది అని కూడా వైసీపీ శిబిరం నుంచి పక్కకు తప్పుకుంటున్నట్లుగా ఉంది. అయితే ఏ పార్టీ అయినా జనంలోకి వెళ్ళాలి. బలం చూపించుకోవాలి. అపుడే నాయకులు అయినా మరెవరు అయినా పార్టీలో కొనసాగుతారు. భారీ ఓటమి తరువాత వైసీపీ పరిస్థితి ఏమిటి అన్నది ఎవరికీ తెలియదు. జగన్ అయితే తాము మళ్ళీ 2029లో అధికారంలోకి వస్తామని నిబ్బరంగా ఉన్నారు. ఆయనకు ఉన్న నిబ్బరం క్యాడర్ కి లీడర్ కి లేదు. దానిని వారిలో నింపాలీ అంటే జగన్ బయటకు రావాలి. ఆయన జనంలోకి వెళ్తే వారి నుంచి వచ్చే ప్రజా స్పదనను నాయకులు గమనిస్తారు. అపుడే వారు పార్టీలో ఉండేందుకు మొగ్గు చూపిస్తారు. అలా కాకుండా మనకు బలం ఉంది అని అధినాయకత్వం అనుకున్నా అది నాయకులకు చెప్పినా వారు దానిని ఎంత మేరకు పట్టించుకుంటారు అన్నదే చర్చగా ఉంది. మరో వైపు చూస్తే వైసీపీలోని ఈ స్తబ్దతను చూసి ప్రత్యర్థి అయిన కూటమి పార్టీలు వారిని ఆకట్టుకుంటున్నాయి. నాలుగేళ్ళకు పైగా అధికారం చేతిలో ఉండడంతో వారిని తమ వైపు తిప్పుకుంటున్నాయి. ఈ తరహా వలసలకు అడ్డుకట్ట వేయాలంటే జగన్ జనంలోకి రావాలని అంటున్నారు. తాను ఎంచుకున్న ముహూర్తం నాడే వస్తామని ఆయన అనుకుంటే కనుక అప్పటికి పార్టీలో ఎంతమంది మిగులుతారు అన్నది కూడా చర్చగానే ఉంటుందని అంటున్నారు. ఏది ఏమైనా ఒక్కసారి వెనక్కి వెళ్ళి చూస్తే 2919లో ఓటమి చెందగానే టీడీపీ అధినేత చంద్రబాబు జనంలోకి వెళ్ళారు. అలా పార్టీని నిలబెట్టుకున్నారు. అదే తీరున వైసీపీ కూడా ప్రజల వద్దకే వెళ్ళాలి అని అంటున్నారు. జగన్ ఒక్కసారి ప్రజలలోకి వస్తే మొత్తం సీన్ మారుతుందని వైసీపీ నేతలు అంటున్నారు. కానీ అది జరగడమే ఆలస్యం అవుతోంది. ఇంతలో ఎవరికి వారు సర్దుకుంటున్నారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు వైసీపీ హైకమాండ్ తగిన యాక్షన్ ప్లాన్ తో ముందుకు రావాలని అంతా కోరుతున్నారు.

## ఒంటిమిట్టలో మంత్రుల బృందం పర్యటన

**కడప: పెన్ పవర్:** ఒంటిమిట్ట శ్రీరాముల కళ్యాణోత్సవం ఏర్పాట్లపై మంత్రుల బృందం సందర్శించింది. ఒంటిమిట్ట శ్రీరాముల కళ్యాణ మహోత్సవం కోసం ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 11న సీఎం చంద్రబాబు స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పిస్తారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేతృత్వంలో సోమవారం ఆలయం వద్ద ఏర్పాట్లను మంత్రుల బృందం సమీక్షించింది. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, పలువురు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## హెచ్సీయూ భూములు

## ప్రభుత్వ తీరును తప్పు పట్టిన ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్: పెన్ పవర్:** కంచె గచ్చిబౌలి భూమి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు బాగాలేదని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. గతంలో కాం గ్రెస్ ప్రభుత్వం కేటాయించిన భూములను ప్రేవేట్ వ్యక్తులకు ఎలా అమ్ముతారని ప్రశ్నించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్టూడెంట్స్ అసోసియేషన్ , అల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ , ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 400 ఎకరాల భూమి వేలం అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని విమర్శించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉండే యూనివర్సిటీని బుల్డోజర్లతో యుద్ధవాతావరణం నెలకొల్పారన్నారు. ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూర్చుకోవాలంటే అనేక మార్గాలు ఉన్నాయని... కానీ జీవవైవిధ్యాన్ని నాశనం చేసేలా ప్రకృతిని ధ్వంసం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్ లను పరిగణలోకి తీసుకుని , ఆ భూమిని యూనివర్సిటీ కు అప్పగించాలని ఆర్ కృష్ణయ్య కోరారు.

## భార్యపై హత్యాయత్నం చేసిన భర్త

**హైదరాబాద్ పెన్ పవర్:** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో లో దారుణం జరిగింది. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కట్టుకున్న భార్య షబానా పర్వీన్ ను బండరాయి తో మోది హత్యకు భర్త బస్రత్ ప్రయత్నించాడు. కొండాపూర్ లో ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఘటన జరిగింది. దాడి అనంతరం భార్యను నడిరోడ్డు పై వదిలేసి భర్త పరారయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గర్భవతిగా ఉన్న భార్యను . తీవ్ర గాయాలతో చావు బ్రతుకుల మధ్య నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దంపతులు పొందుతున్న హాఫీజ్ పెట్ లో నివాసం ఉంటున్నారు.

# పేరుకు రైజింగ్ స్టేట్..కానీ వైద్య సేవలకు దిక్కులేదు

**విజయవాడ: పెన్ పవర్:** ఏపీ పేరుకు రైజింగ్ స్టేట్..కానీ వైద్య సేవలకు దిక్కులేదు. పేదోడి ఆరోగ్యానికి రాష్ట్రంలో భరోసా లేదని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వానిది అంతులేని నిర్లక్ష్యం. ఆరోగ్య శ్రీ సేవల కింద రూ.3500 కోట్లు పెండింగ్ పెట్టడం నిజంగా సిగ్గుచేటు. గత 9 నెలలుగా పూర్తి స్థాయిలో బకాయిలు విడుదల చేయకుండా, వైద్య సేవలు ఆపేదాక చూడటం అంటే, ఆరోగ్యశ్రీ పై సర్కారుకున్న చిత్తశుద్ధి ఏంటో అర్థమౌతుందని అన్నారు. పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే ఇదంతా. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచే, ఆరోగ్యశ్రీ అనారోగ్య శ్రీగా మారింది. పేదోడికి వైద్యం అందని ద్రాక్ష అయ్యింది. వైద్య సేవలను విస్తృత పరుస్తామని.. వైద్యానికి గ్లోబల్ సిటీగా చేస్తామని, గొప్పలు చెప్పే చంద్రబాబు గారు.. ముందు ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయండని అన్నారు. ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టినా అవి చెల్లించాల్సిన బాధ్యత మీదే అని తెలుసుకోండి. వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలవండి. తక్షణం వైద్య సేవలను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోండి. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ కింద వైద్యం అందక ఏ ఒక్కరూ మృతిచెందినా, అవి కూటమి ప్రభుత్వం చేసిన హత్యలే అవుతాయని గుర్తుపెట్టుకోండి. పేదవారి ఆరోగ్యానికి సంజీవనిలా మారిన ఆరోగ్య శ్రీ పథకానికి, ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## 75 మ్యాచ్‌లకు ఒకసారి ఆడతాడు.. స్టార్ ఆటగాడిని హేలీ తోకచుక్కతో పోల్చిన సంజయ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్ వెల్ ఐపీఎల్ లో తన పేలవ ఫామ్ ను కొనసాగిస్తున్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున గత సీజన్ లో ఒక్క మెరుపు ఇన్నింగ్స్ కూడా లేకపోగా ప్రతి ఇన్నింగ్స్ లో ఘోరంగా విఫలమయ్యాడు. అయితే 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ లో పంజాబ్ అతన్ని నమ్మి రూ. 4.2 కోట్లకు తీసుకుంటే తొలి మ్యాచ్ లోనే డకౌటయ్యాడు. ఆడిన తొలి బంతికే సాయి కిషోర్ ఫ్యాన్స్ రివర్స్ స్వీప్ ఆడి ఎల్బీడబ్ల్యూ రూపంలో వికెట్ సమర్పించుకున్నాడు. రెండో మ్యాచ్ లో బ్యాటింగ్ ఆడే అవకాశం రాకపోగా మూడో మ్యాచ్ లో ఒక సిక్స్, మూడు ఫోర్లతో పర్వాలేదనిపించాడు.

ఐపీఎల్ లో మ్యాక్స్ వెల్ తన స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించక చాలా కాలమే అయింది. స్టార్ ఆటగాడిగా ప్రతి మ్యాచ్ లో ప్లేయింగ్ 11 లో చోటు కల్పించినా తీవ్రంగా నిరాశకు గురి చేస్తున్నాడు. ఈ ఆసీస్ స్టార్ ఆటగాడి ప్రదర్శనను కామెంటేటర్, భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ దారుణంగా విమర్శించాడు. ప్రస్తుతం జరుగుతున్నా ఐపీఎల్ లో మ్యాక్స్ వెల్ ఇంకా తన ఆటను నిరూపించుకోలేదని చెప్పిన మంజ్రేకర్ అతని బ్యాటింగ్ ను 75 సంవత్సరాలకు ఒకసారి కనిపించే 'హాలీస్ కామెట్'తో పోల్చాడు.

"హేలీ తోకచుక్క సూర్యుని చుట్టూ తిరుగుతుంది. ప్రతి 75 సంవత్సరాలకు ఒకసారి భూమి నుండి కనిపిస్తుంది. అదేవిధంగా గ్లెన్ మ్యాక్స్ వెల్ 75 మ్యాచ్ ల్లో ఒక మంచి ఇన్నింగ్స్ మాత్రమే ఆడతాడు. హేలీ తోక చుక్క చివరిసారిగా 1986లో కనిపించింది. ఇది మళ్ళీ 2061లో కనిపిస్తుంది. బ్యాటింగ్‌లో మ్యాక్స్ వెల్ విషయంలో కూడా ఇదే పరిస్థితి. మ్యాక్స్ వెల్ క్రికెట్ లో హేలీ తోకచుక్క" అని మంజ్రేకర్ జియోహాట్‌స్టార్‌లో అన్నారు. పక్కనే ఉన్న నవజ్యోత్ సింగ్ సిద్ధూ.. మంజ్రేకర్‌తో విభేదించాడు. మాక్స్‌వెల్ ప్రతి 25 మ్యాచ్ లలో ఒకసారి రాణిస్తాడని చెప్పుకొచ్చాడు.

మ్యాక్స్ వెల్ ఇదే ప్రదర్శన కొనసాగితే అతను తుది జట్టులో చోటు సంపాదించుకోవడం కూడా కష్టంగా కనిపిస్తుంది. ఐపీఎల్ 2024 సీజన్ లో బెంగళూరు తరపున అట్టర్ ఫ్లాప్ షో చేశాడు. మొత్తం 9 ఇన్నింగ్స్ ల్లో 52 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. వీటిలో నాలుగు డకౌట్స్ ఉన్నాయి. స్టార్ ప్లేయర్ అని వరుస అవకాశాలు ఇస్తుంటే ఒక్క మ్యాచ్ లో కూడా ప్రభావం చూపించలేకపోయాడు. బ్యాటింగ్ ఇలా వచ్చి అలా వెళ్ళాడు. పట్టుమని పది బంతులు ఆడకుండా కనీసం రెండంకెల స్కోర్ చేయకుండానే పెవిలియన్ కు చేరుతున్నాడు. రూ. 11 కోట్ల భారీ ధరకు దక్కించుకున్న ఆర్సీబీ నిరాశ తప్పలేదు.

## చాలా రోజులు ఆ బాధ నుంచి బయటకు రాలేకపోయాను: మహమ్మద్ సిరాజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 లో టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ అదరగొడుతున్నాడు. ప్రతి మ్యాచ్ లో వికెట్లు తీస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న ఈ హైదరాబాదీ పేసర్.. నాలుగు మ్యాచ్ ల్లో 9 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్ల లిస్ట్ లో రెండో స్థానంలో ఉన్నాడు. గత సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ తరపున అట్టర్ ఫ్లాప్ అయిన సిరాజ్.. ఈ సీజన్ లో మాత్రం దుమ్ములేపుతున్నాడు. ఆదివారం (ఏప్రిల్ 6) గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో నాలుగు వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. సొంతగడ్డపై రైజర్స్ ఆటను ఆస్వాదించాలని ఆశించిన ఫ్యాన్స్‌ను మహ్మద్ సిరాజ్ (4/17) నిరాశకు గురి చేశాడు. గుజరాత్ టైటాన్స్‌కు ఆడుతున్న సిరాజ్ లీగ్‌లో కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో విజృంభించిన వేళ రైజర్స్ హిట్టర్లంతా మరోసారి ఫ్లాపయ్యారు. సిరాజ్ విజృంభణతో ఈ మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ తర్వాత సిరాజ్ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో తనను తప్పించడంపై పరోక్షంగా అసంతృప్తి వ్యాఖ్యలు చేశాడు. సిరాజ్ మాట్లాడుతూ.. " ఛాంపియన్స్ ట్రోఫీలో చోటు దక్కనందుకు నేను జీర్ణించుకోలేకపోయాను. కానీ ఆ తర్వాత నా బౌలింగ్, ఫిట్ నెస్ పై దృష్టి పెట్టాను. నా బలహీనతలను తెలుసుకొని నెట్స్ లో తీవ్రంగా శ్రమించాను. నేను ఇప్పుడు నా బౌలింగ్ ను ఆస్వాదిస్తున్నాను. భారత జట్టుకు ఎంపిక కాకపోయినా.. ఐపీఎల్ లో రాణించేందుకు సిద్ధంగా ఉన్నాను. ఆర్సీబీ జట్టు తరపున 7 ఏళ్ళ ఆడాను. ఆ జట్టుకు ప్రత్యర్థిగా ఆడడం ఎమోషనల్ కు గురి చేసింది. హైదరాబాద్ లో ఆడడం ఎల్లప్పుడూ ప్రత్యేకమే". అని సిరాజ్ అన్నాడు.

ఫిబ్రవరి నెలలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో సిరాజ్ స్థానం దక్కించుకోవడంలో విఫలమయ్యాడు. భారత సెలక్టర్లు ప్రకటించిన 15 మంది స్క్వాడ్ లో సిరాజ్ పై వేటు పడింది. ఖచ్చితంగా ప్లేయింగ్ 11 లో ఉంటాడన్న సిరాజ్ కనీసం స్క్వాడ్ లో కూడా ఎంపిక చేయలేదు. సిరాజ్ ను పక్కన పెట్టడానికి కారణం లేకపోలేదు. భారత జట్టులో గత ఏడాది కాలంగా వరుస అవకాశాలు దక్కించుకున్నప్పటికీ తన అత్యున్నత ప్రదర్శన ఇవ్వలేకపోవడమే ఇందుకు కారణం అని తెలుస్తుంది. అనుభవం దృష్ట్యా సిరాజ్ ను ఎంపిక చేయాల్సిందని చాలా మంది తమ అభిప్రాయాన్ని తెలిపారు.

## ఇషాంత్‌కు దెబ్బ మీద దెబ్బ.. గుజరాత్ పేసర్‌కు భారీ జరిమానా విధించిన బీసీసీఐ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 18లో భాగంగా ఆదివారం (ఏప్రిల్ 6) సన్ రైజర్స్ హైదరాబాద్?తో జరిగిన మ్యాచులో ధారాళంగా పరుగులు సమర్పించుకున్న జీటీ పేసర్ ఇషాంత్ శర్మకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఈ మ్యాచులో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినం దుకు ఇషాంత్ శర్మకు మ్యాచ్ ఫీజులో రూ.25 లక్షల జరిమానా విధించింది ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ. ఫైన్‌తో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించింది. మరో రెండు డీమెరిట్ పాయింట్లు వస్తే ఇషాంత్ శర్మపై ఒక మ్యాచ్ నిషేధం పడే అశకాశం ఉంది. ఇషాంత్ ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం లెవల్ 1 నేరానికి పాల్పడ్డాడని బీసీసీఐ స్పష్టం చేసింది. దుస్తుల్ని కానీ, గ్రౌండ్ ఈక్విప్మెంట్ పట్ల కానీ అమర్యాదరకంగా ప్రవర్తిస్తే ఐపీఎల్ ప్రవర్తనా నియామావళిలోని 2.2 ప్రకారం లెవల్ 1 కింద ఫైన్ విధిస్తారు. లెవల్ 1 నేరాన్ని ఇషాంత్ శర్మ అంగీకరించడంతో.. మ్యాచ్ రెఫరీ నిర్ణయం ప్రకారం జరిమానా విధించినట్లు బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్?లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచులో గుజరాత్ టైటాన్స్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అతిథ్య ఎస్ఆర్?హెచ్?ను 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. అయితే.. గుజరాత్ మ్యాచ్ గెలిసినప్పటికీ జీటీ సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ చెత్త ప్రదర్శన చేశాడు. నాలుగు ఓవర్లు వేసిన ఇషాంత్ ఒక్క వికెట్ తీయకుండా 53 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ మ్యాచులో ఎస్ఆర్?హెచ్ మొత్తం 152 పరుగులు చేస్తే.. ఇందులో ఒక్క ఇషాంత్ శర్మనే 53 పరుగులు ఇవ్వడం గమనార్హం. తన బౌలింగ్?ను ఎస్ఆర్?హెచ్ చితకబాదటంతో ఇషాంత్ తీవ్ర అసహనానికి గురై గ్రౌండ్లో నిబంధనలు ఉల్లంఘించాడు. అప్పటికే పరుగులు ఎక్కువ ఇచ్చానని బాధలో ఉన్నా ఇషాంత్?కు.. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించడంతో బీసీసీఐ ఫైన్ వేసి మరో షాక్ ఇచ్చింది.



అనిఖా సురేంద్రన్ గ్రేస్ మరియు గాంభీర్యంతో వర్ధమాన తార

# అఖిల్ కోసం ఈ టైటిల్ సరైనదేనా?

ఏదైనా సినిమాకి టైటిల్ అత్యంత కీలకమైనది. టైటిల్ సగం జనాల్ని థియేటర్లకు లాగుతుంది. అది ఒక్కటీ కనెక్టయితే సగం సక్సెసైనట్టే. కానీ కొన్నిసార్లు టైటిల్ అనుకున్న విధంగా కుదరకపోతే దర్శకనిర్మాతలు మల్లగుల్లాలు పడాల్సి ఉంటుంది. అఖిల్ తదుపరి సినిమా టైటిల్ విషయంలో అలాంటి చిక్కులేవీ లేవు. దర్శకనిర్మాతలు చాలా పకడ్బందీగా ఎంపిక చేసారని తెలుస్తోంది. అక్కినేని అఖిల్ నటిస్తున్న తదుపరి చిత్రానికి – లెనిన్– అనే టైటిల్ వినిపిస్తోంది. అయితే దీనిని చిత్రబృందం ఇంకా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. అంతేకాదు.. అఖిల్ సినిమాలో టైటిల్ సాంగ్ ని కూడా చిత్రబృందం తెరకెక్కించనుందని తెలుస్తోంది. ఈ పాట చిత్రీకరణ కోసం హైదరాబాద్ లో సెట్స్ కూడా వేస్తున్నారు. అంటే ఇప్పటికే టైటిల్ ఫిక్సయి ఉంది. దానిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుంది. అఖిల్ ఈ పాటలో సరికొత్త మాస్ స్టెప్పులతో అదరగొడతాడని, మునుపెన్నడూ చూడని కొత్త యాంగిల్ అతడిలో కనిపిస్తుందని చెబుతున్నారు. అక్కినేని అఖిల్ నటించిన సినిమాల టైటిల్స్ ని పరిశీలిస్తే... అఖిల్, మిస్టర్ మజ్ను, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, ఏజెంట్ .. ఇవన్నీ క్లాసీ టైటిల్స్. తదుపరి – లెనిన్ – ని నిర్మాతలు అధికారికంగా ఫిక్సయితే ఇది కూడా ఇదే జాబితాలో చేరే అవకాశం ఉంది. నిజానికి లెనిన్ అనేది పవర్ ఫుల్ టైటిల్. చరిత్రలో – లెనిన్– అనే పేరుకు చాలా గొప్ప ప్రధాన్యత ఉంది. లెనిన్ అంటే కమ్యూనిజం, మార్క్సిజానికి సింబాలిక్. అందువల్ల ఈ టైటిల్ ఎంపిక ఆసక్తి రేకెత్తించేదే. కానీ అది కథకు లింకప్ అయి ఉండాలి.

ఈ చిత్రానికి మురళీ కిషోర్ అబ్బూరి (నందు) దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం యాక్షన్ షెడ్యూల్ శరవేగంగా పూర్తవుతోంది. అఖిల్ పై ఈ సీన్స్ తెరకెక్కిస్తున్నారని సమాచారం. అలాగే అఖిల్ పాత్ర గురించి అందిన లీకుల ప్రకారం.. అతడు చిత్తూరు యాసలో మాట్లాడతారని తెలిసింది. సీమ యాసతో పాటు, తిరుపతి లోకల్ కుర్రాడిలా అతడు మాట్లాడతాడట. శ్రీలీల ఇందులో కథానాయికగా నటించనుందని తెలుస్తోంది. ఎవరూ ఊహించని విధంగా దసరా బరిలో ఈ సినిమాని రిలీజ్ చేస్తారని కూడా టాక్ వినిపిస్తోంది.





సాక్షి మాలిక్ స్టైల్ మరియు గాంభీర్యం యొక్క పరిపూర్ణ సమ్మేళనం

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com